RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 198 మేడ్చల్ మల్కాజ్‌గిరి 10 ఆగష్టు 2024 శనివారం పేజీలు : 4

## బీజేపీ హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమం

న్యూఢిల్లీ : భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మరికొద్ది రోజుల్లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో 'హర్ ఘర్ తిరంగా' పేరిట బీజేపీ ప్రచార కార్యక్రమా న్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమాన్ని జాతీయ పండగగా నిర్వహించాలని జులైలో మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొని జాతీయ పతాకంతో సెల్ఫీ దిగి.. ఆ చిత్రాన్ని హర్‌తిరంగా.కామ్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు ప్రధాని మోదీ సూచించిన విషయం విధితమే. ఆగస్ట్ 13 నుంచి 15వ తేదీ వరకు నివాసాలపై, వ్యాపార కేంద్రాలపై త్రివర్ణ పతాకం ఎగరవేయాలని ప్రజలకు బీజేపీ సూచించింది.




# మూడో విడత రుణమాఫీకి చకచకా ఏర్పాట్లు

## రూ.2 లక్షల వరకు బకాయిలు ఒకేసారి మాఫీ
## అంతకుమించి అప్పున్న వారికి మరో దఫాలో..
## రూ.15 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా

హైదరాబాద్ : రూ.2 లక్షలు, ఆపైన రుణాలున్న రైతులను రెండు విభాగాలుగా విభజించి రుణమాఫీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.లక్ష, లక్షన్నర రుణాలను రెండు విడతల్లో మాఫీ చేసిన సర్కారు.. రూ.2 లక్షలు, అంతకంటే ఎక్కువగా అప్పులున్న రైతులకు రెండు దఫాలుగా రుణమాఫీ చేయనుంది. రూ.2 లక్షల వరకు అప్పున్న రైతులను ఒక విభాగంలో, రూ.2 లక్షల కంటే ఎక్కువగా బకాయిలున్న రైతులను మరో విభాగంలో తీసుకోనుంది. అంటే.. మూడో విడత రుణమాఫీని రెండు దఫాలుగా అమలు చేయనుంది. ఈ మేరకు వ్యవసాయ, ఆర్థిక శాఖ అధికారులు రైతుల రుణ సమాచారాన్ని సేకరిస్తున్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం.. రూ.2 లక్షల కంటే ఎక్కువ బాకీ ఉన్న రైతులకు కూడా రూ.2 లక్షలు మాఫీ చేస్తారు. అంటే ఒక రైతుకు 3 లక్షల పంట రుణం ఉంటే.. అందులో రూ.2 లక్షలు ప్రభుత్వం మాఫీ చేస్తుంది.

ఆగస్టులో మూడో విడత మాఫీ పూర్తయిన తర్వాత.. ఇలాంటి రైతులకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ పూర్తవడానికి మరింత సమయం పట్టనుంది.

**ముందు రైతులు.. ఆ తర్వాత ప్రభుత్వం :** రూ.2 లక్షల కంటే ఎక్కువ అప్పున్న రైతులకు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం ఒక షరతు పెట్టింది. 2 లక్షల కంటే ఎక్కువగా ఉన్న మొత్తాన్ని రైతులు ముందుగా బ్యాంకులకు చెల్లించాలి. ఆ తర్వాత ప్రభుత్వం రూ.2 లక్షలు మాఫీ చేస్తుంది. ఉదాహరణకు ఒక రైతుకు రూ. 2.50 లక్షల పంట రుణం ఉంటే.. తొలుత ఆ రైతు రూ.50 వేలు బ్యాంకులో చెల్లించాలి. ఆ తర్వాత ప్రభుత్వం 2 లక్షలను మాఫీ చేసి, రైతు రుణ ఖాతాను జీరో చేస్తుంది. అయితే రెండు లక్షలకు మించి ఉన్న సొమ్మును చెల్లించడానికి రైతులు ఎక్కువ సమయం తీసుకునే అవకాశాలున్నాయి. ఖరీఫ్ సాగు ప్రారంభం కావడం, పెట్టుబడి ఖర్చులు ఉండడంతో 2 లక్షల కంటే ఎక్కువగా ఉన్న మొత్తాన్ని చెల్లించడం రైతులకు ఇబ్బందికరంగా మారనుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం నిధులు సర్దుబాటు చేసుకోవడానికి, అదేక్రమంలో రైతులకు బకాయిలు ఉండకుండా ఏకకాలంలో పంట రుణ ఖాతాను జీరో చేయడానికే ఈ నిబంధనను అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది.రేషన్ కార్డులు లేని రైతు కుటుంబాలను గుర్తించడానికి మూడో విడత తర్వాత సర్వే చేయనున్నారు.

**రెండు విభాగాలకు రూ.15 వేల కోట్లు :** మూడో విడతలో 2 లక్షల రుణమాఫీకి రూ.6 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. మొదటి, రెండో విడత రుణమాఫీకి కూడా రూ.6 వేల కోట్ల చొప్పున నిధులు వెచ్చించారు. రూ.2 లక్షలకు మించి అప్పున్న రైతులకు మాఫీ చేయడానికి రూ.9 వేల కోట్ల మేర అవసరమవుతున్నట్లు అంచనాలున్నాయి. అంటే 2 లక్షలు, ఆపై రుణం ఉన్న రైతులకు మాఫీ చేయడానికి 15 వేల కోట్ల నిధులు అవసరమవుతాయి. అయితే సీఎం రేవంత్ మంగళవారం కూడా రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. రైతుల నుంచి వచ్చే అర్జీలు, తప్పొప్పులు, సవరణలు.. వాటి పరిష్కారంతో మరో రూ.4 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన 3 విడతల మాఫీకి 31 వేల కోట్లు వెచ్చించనున్నారు.



## ఏసీబీ వలలో రెవెన్యూ అధికారి నరేంద్ర

### రూ.6 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు

నిజామాబాద్ నేరవిభాగం: నిజామాబాద్ నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారి నరేందర్ నివాసంలో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. తనిఖీల్లో భారీగా నగదు, బంగారం గుర్తించినట్టు సమాచారం. శుక్రవారం ఉదయం 5గంటల నుంచి సోదాలు కొనసాగుతున్నాయి. తనిఖీల్లో రూ.6.07 కోట్ల విలువ చేసే అక్రమాస్తులను ఏసీబీ గుర్తించింది. అక్రమాస్తులు కలిగి ఉన్నాడనే సమాచారంతో నిజామాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులు నరేందర్ ఇంట్లో సోదాలు జరిపారు. ఇంటితో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, కోటగల్లి, నిర్మల్‌లోని ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. వినాయక్‌నగర్‌లోని అశోక టవర్‌లో ఉన్న నరేందర్ ఇంట్లో ఏకంగా రూ.2.93 కోట్ల నగదు గుర్తించారు. అలాగే ఆయన భార్య బ్యాంకు ఖాతాలో రూ.1.10 కోట్ల నగదు, 51తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.1.98 కోట్లు విలువ చేసే 17 స్థిరాస్తులను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం నరేందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపారు. ఈ దాడుల్లో నాలుగు బృందాలు పాల్గొన్నాయని పేర్కొన్నారు.

## 'సుంకిశాల ఘటనకు కారణం వారే'



నల్లగొండ, ఆగస్టు 09: సుంకిశాల ప్రాజెక్టు కూలడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతే కారణం అని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం నాడు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుక్రవారం నాడు సుంకిశాలలో పర్యటించారు. సుంకిశాలలో నిర్మించిన ప్రాజెక్టు కూలిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు టార్గెట్‌గా సంచలన ఆరోపణలు చేశారు. తొలుత మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'జరిగిన సంఘటన చిన్నది.. నష్టం కూడా తక్కువే.. ఆ నష్టాన్ని కాంట్రాక్టర్ భరిస్తారు. ప్రజలకు, ప్రభుత్వానికి ఎలాంటి నష్టం లేదు. ప్రాజెక్టు పూర్తి కాలేదు.. నిర్మాణంలో లేదు. నిర్మాణం పూర్తి కావడానికి ఒకటి, రెండు నెలలు పట్టేది. ప్రస్తుతం నిర్మాణం ఆలస్యం కానుంది. గత ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయలేదు. SLBC ప్రాజెక్టు ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తాం. డిండి ఎత్తిపోతల పథకం కూడా పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నాయకులు ఎందుకు విమర్శలు చేస్తున్నారో అర్థం కావడం లేదు. సుంకిశాల అన్ని పనులు బీఆర్ఎస్ హయంలోనే జరిగాయి.' అని అన్నారు.

**మంత్రి తుమ్మల ఫైర్..** సుంకిశాల ప్రాంతాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించిందన్నారు. ప్రాజెక్టు కూలిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామన్నారు. జరిగిన నష్టాన్ని నిర్మాణ సంస్థే భరిస్తుందన్నారు. ఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నామని.. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పనులు పూర్తి చేయాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

**గుత్తా సుఖేందర్ రెడ్డి కామెంట్స్..** గోదావరి నదిపై ప్రాజెక్టుల నిర్మాణం జరిగినంత వేగంగా కృష్ణా నది ప్రాజెక్టుల పనులు జరగడం లేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. సుంకిశాల ప్రాజెక్టు ఎందుకు ప్రారంభించారో కేసీఆర్, కేటీఆర్‌కే తెలియాలని వ్యాఖ్యానించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు తాగునీరు అందించేందుకు సుంకిశాల అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఇది కేసీఆర్ మానస పుత్రికనో లేక కేటీఆర్ మానస పుత్రికనో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీపై కేటీఆర్ రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు.



## కవిత జైలులో ఇబ్బంది పడుతోంది.. కేటీఆర్ ఆవేదన

హైదరాబాద్, ఆగస్టు 9: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయి తీహార్ జైలులో ఉన్న చెల్లెలు కవిత గురించి అన్న కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు, బీఆర్ఎస్ నేతలు తీహార్ జైలుకు వెళ్లి కవితో ములాఖత్ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ...కవిత జైల్లో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. ఇప్పటి వరకు 11 కిలోలు తగ్గారని.. బీపీ వచ్చిందని తెలిపారు. దాని వల్ల రోజు రెండు టాబ్లెట్స్ వేసుకోవాల్సి వస్తుందన్నారు. ఢిల్లీ డిప్యూటీ సీఎం సిసోడియాకు బెయిల్ అంశం అనేది ఆలోచించి మాట్లాడాలన్నారు. దేశంలో పొలిటికల్‌గా కొట్లాడాల్సి వచ్చినప్పుడు ఇలాంటివి తప్పవని చెప్పుకొచ్చారు. బెయిల్ కోసం నిన్న అప్పీల్ చేసామని... నెక్స్ట్ వారంలో వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నామన్నారు. సిసోడియాకు వచ్చింది కాబట్టి మిగతా వాళ్లకు వస్తుందని అభిప్రాయపడ్డారు. జైల్లో ఖైదీలు 11 వేలు ఉండాల్సిన చోట 30 వేలు మంది ఉన్నారన్నారు. జైలు పరిశుభ్రంగా లేదన్నారు. జైలుకు వెళ్లి వచ్చిన వాళ్ళు భవిష్యత్‌లో పెద్ద లీడర్లు అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు.

# లెక్కలు మారుతున్నాయ్...!

## తెలంగాణలో బీజేపీ గ్రాఫ్.. పడిపోతుందా..?




హైదరాబాద్ : 8 ఎంపీ సీట్లు.. 8 మంది ఎమ్మెల్యేలు. ఇది తెలంగాణలో బీజేపీ ట్రాక్ రికార్డ్.. రోజురోజుకు పడిపోతున్న బీఆర్ఎస్ గ్రాఫ్ బీజేపీకి ఓ అవకాశం.. మరి ఆ అవకాశాన్ని బీజేపీ ఏ మేర అందిపుచ్చుకుంటుంది? ఈ క్వశ్చన్‌కు ఆన్సర్ జీరో అని చెప్పాలి. ఎందుకంటే ప్రస్తుతం బీజేపీలోనే కల్లోల పరిస్థితులు ఉన్నాయి. ఎంతలా అంటే ఉన్న ఎనిమిది ఎమ్మెల్యేలు కూడా పార్టీ మీటింగ్‌కు హాజరుకాలేనంత.. ఇంతకీ బీజేపీలో ఏం జరుగుతుంది? భవిష్యత్ ఎన్నికలు, పార్టీ విస్తరణ.. ఈ అజెండాతో బీజేపీ ఓ మీటింగ్‌కు పిలుపునిచ్చింది. ఈ మీటింగ్‌లో పార్టీ ఫ్యూచర్ పరిస్థితేంటో కానీ.. ప్రెసెంట్ అయితే ఏం బాగా లేదని తెలుస్తోంది. ఈ మీటింగ్‌కి టీచర్స్ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డితో పాటు ఏకంగా ఏడుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. అటెండ్ అయ్యింది ఒకే ఒక్కరు. ఆయనే నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త.. అటు ఎమ్మెల్యేలు రాలేదు.. ఎమ్మెల్సీలూ రాలేదు. దీంతో మరోసారి ప్రచారం మొదలైంది. పార్టీ పెద్దలు, ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ పెరిగింది అని.. మరి జరుగుతుంది కదా.. పార్టీ పెద్దలంతా వచ్చి.. నేతలు రాకపోతే.. మరి మీటింగ్‌కు ఎందుకు రాలేదు అంటే.. ఒక్కొక్కరిది ఒక్కో రీజన్.. పార్టీ ఆఫీస్‌కు కూత వేటు.. అంటే పిలిస్తే పలికేంత దూరంటో ఉండే రాజాసింగ్ కూడా.. పార్టీ ఆఫీస్ మొఖం చూడలేదు. చాలా రోజులుగా పార్టీ ప్రజాప్రతినిధుల్లో ఓ రకమైన అలక కనిపిస్తోంది. పార్టీ యాక్టివిటీస్‌లో తమను ఇన్‌వాల్వ్ చేయడం లేదని. అందుకే ఈ మీటింగ్‌కు లైట్ తీసుకున్నారనేది టాక్. నిజానికి తెలంగాణలో గతంలో కంటే మంచి పోజిషన్‌లో ఉంది. దానిని మరింత మెరుగుపరుచుకునే చాన్స్ తీసుకోవడం లేదు. ఎందుకంటే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. ఈ టైమ్‌లో లీడర్సంతా కలిసికట్టగా ఎన్నికలకు రెడీ కావాలి. కానీ ఆ పరిస్థితులు లేవు. హైకమాండ్ కూడా ఇవన్నింటిని పరిశీలిస్తూనే ఉంది. అందుకే ఇలాగైతే కష్టమన్న భావనకు వచ్చినట్టుంది. అందుకే నేరుగా బీఎల్ సంతోష్‌తో పాటు మరికొంత మంది అగ్ర నేతలు ల్యాండ్ ఆయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో ఏం జరుగుతుంది? అంతర్గత వ్యవహారాల్లో ఏం జరుగుతుంది? ఇలా అన్ని అంశాలపై కేంద్ర కార్యాలయానికి రిపోర్ట్స్ అందాలి. కానీ అలా జరగడం లేదనేది కమలనాథుల సర్కిల్స్‌లోనే టాక్ వినిపిస్తోంది. అంతేకాదు అధ్యక్ష బాధ్యతల మార్పు కూడా మరోసారి తెరపైకి వచ్చింది. అయితే 2028లో రాష్ట్రంలో అధికారంలోకి రావడమే అసలు టార్గెట్ అని తెలుస్తోంది. హైకమాండ్ దూరదృష్టితో ఉంటే.. లోకల్ నేతలు మాత్రం పరస్పర ఆరోపణలు, విమర్శలతో కాలం గడిపేస్తున్నారు. మీకు మీరే.. మాకు మేమే అనే తీరు అర్థవంతంగా కనిపిస్తోంది. అధ్యక్ష పదవి కోసం రెండుగా చిలీపోయారు నేతలు. కొత్త, పాత అంటూ రెండు గ్రూప్‌లు కట్టేశారు.. మరి అసలు పరిస్థితేమో ఇలా ఉంది. పార్టీ పెద్దలేమో భారీ ఆశలతో వస్తున్నారు. ఇప్పటికైనా గ్రౌండ్ రియాలిటీ తెలుసుకొని నేతలను చక్కదిద్దకపోతే పరిస్థితులు మెరుగవ్వడం పక్కన పెడితే.. మరింత దిగజారడం ఖాయం.

# సంపాదకీయం

## న్యాయం కోసం వీధుల్లోకి వచ్చినప్పుడు మాట్లాడని మోడీ మాట్లాడటమా?

మన దేశంలో ఒక విచిత్రమైన సన్నివేశం కనిపిస్తూ ఉంటుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏం చేసినా తప్పు కాదు ఒప్పే అనే వర్గం ఎంత బలంగా తమ వాదనను వినిపిస్తుందో.. అంతే బలంగా పీఎం నరేంద్ర మోడీ ఏం చేసినా అందులో ఒప్పు కంటే తప్పులే వెతికే వర్గం ఇంకొకటి ఉంటుంది. వీరి తీరు రోటీన్ కు భిన్నంగా ఉంటుంది. ఇలాంటి వారి ఆలోచనలు విన్నప్పుడు.. వారిని ఏమనాలో ఒక పట్టాన అర్థం కాదు. ఏం చేసినా..చివరకు మోడీలో లోపాన్ని వెతకటమే లక్ష్యంగా వారి తీరు ఉంటుంది. భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఒలింపిక్స్ లో ఫైనల్ కు చేరి.. స్వర్ణం ఖాయమనుకున్న వేళ.. అనూహ్యంగా ఆమె ఉండాల్సిన బరువు కంటే వంద గ్రాములు అధికంగా బరువు ఉందన్న కారణంగా అనర్హత వేటు వేయటం.. కోట్లాది మంది భారతీయులకు షాకింగ్ గా మారింది. ఇక.. వినేశ్ పరిస్థితి చెప్పాల్సిన అవసరమే లేదు. కన్నీరు మున్నీరు అవుతోంది. పోటీకి ముందు రోజు ఉండాల్సిన బరువులోనే ఉన్న ఆమె.. పోటీ వేళకు వంద గ్రాముల బరువు అధికంగా ఉండటంతో ఆమెపై అనర్హత వేటు వేయటంతో తీవ్రంగా బాధిస్తోంది. ఇలాంటి వేళ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సైతం స్పందించారు. “వినేశ్.. నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్.నీ ప్రతిభ దేశానికి గర్వకారణం. భారతీయులందరికీ నువ్వు స్ఫూర్తిదాయకం. ఈ రోజు నీకు తగిలిన ఎదురుదెబ్బ ఎంతో బాధించింది. దీన్ని వ్యక్తం చేయటానికి నా దగ్గర మాటల్లేవు. కానీ.. ఈ బాధ నుంచి బయటపడి.. బలంగా తిరిగి రాగలవని నేను నమ్ముతున్నా. సవాళ్లను ఎదిరించటం నీ తీరు. మేమంతా నీకు అండగా ఉన్నాం” అంటూ ఇచ్చిన భరోసా ఆసక్తికరంగా మారింది. ఇదంతా చదివిన వారు ఎవరైనా.. ప్రధాని మోడీ స్పందించిన తీరుకు ఫిదా అవుతారు. అందరిలా ఉంటే.. ఇందాక చెప్పిన వారి ప్రత్యేకత ఏముంటుంది? అందుకే వారిప్పుడు కొత్త పల్లవిని వినిపిస్తున్నారు. రెజ్లర్ల పట్ల బీజేపీకి చెందిన ఎంపీ బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ వీధుల్లోకి వచ్చి పోరాటం చేయటం.. వారాల పాటు సాగిన ఈ రచ్చపై అప్పట్లో ప్రధానమంత్రి ఏ దశలోనూ కల్పించుకోకపోవటం తెలిసిందే. దీనిపై అప్పట్లో తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. ఈ నిరసనల్లో పాల్గొన్న ప్రముఖ క్రీడాకారుల్లో రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఒకరు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్న మోడీ వ్యతిరేకులు.. అప్పట్లో వీధుల్లోకి వచ్చి.. న్యాయపోరాటం చేసే వేళలో స్పందించని ప్రధాని.. ఇప్పుడు మాత్రం రియాక్టు అవుతున్నారు. వినేశ్ విషయంలో ఆయన స్పందించక తప్పనిపరిస్థితి ఏర్పడిందంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఇలాంటి వారి మాటల్ని విన్నప్పుడు.. మోడీ చేసే ప్రతి పనిలోనూ నెగిటివ్ ను వెతకటమే వారి లక్ష్యమన్న భావన కలగటం ఖాయం.

## స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించండి...

### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు గౌతమ్ పొట్రు అధికారులను ఆదేశించారు. ఈ నెల 15న కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించబోయే భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం నాడు అదనపు కల్లెక్టరు లోకల్ బాడీస్ రాధిక గుప్తా, అదనపు కల్లెక్టరు రెవిన్యూ విజయేందర్ రెడ్డి, జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు పోలీస్ గౌరవ వందన స్వీకరణ, బందోబస్తు ఏర్పాట్లను నిర్వహించాలని, స్టేజ్, సీటింగ్, పి.ఎ. సిస్టమ్, త్రాగునీరు,పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, గౌరవ ముఖ్య అతిథి ప్రసంగం రూపొందించాలని, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, గ్రౌండ్ లో మెడికల్ టీమ్ తో ఎమర్జెన్సీ సేవలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్తమ సేవలందించే ఉద్యోగులను గుర్తించి ఉత్తమ సేవా ప్రశంసా పత్రాల కోసం ప్రతిపాదనలు పంపాలని కోరినారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నా అత్యంత ప్రతిష్టాత్మకమైన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తెలియచేసే స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబందిత శాఖ అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించాలని తెల్పినారు. జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు నిర్వహించే ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ప్రోటోకాల్ నిబంధనలను జిల్లా అధికారులు ఖచ్చితంగా పాటించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి హరిప్రియ సంబందిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను తప్పక పాటించాలి



శామీర్ పేట, (గరుడ వార్త) : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను తప్పక పరిశుభ్రంగా ఉంచుకోవాలని శామీర్ పేట మండల ప్రత్యేక అధికారి సైదులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని లాల్ గడి మలక్ పేట లో సచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ఎంపీడీవో మమత బాయి తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వచ్ఛదనం, పచ్చదనాన్ని చేపట్టాలని, ఇందులో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఎక్కడ కాలి స్థలం ఉంటే అక్కడ అధికంగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. గ్రామంలోని జిల్లా



పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొక్కలు నాటారు. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. మానవహారం నిర్వహించి విద్యార్థులచే ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వినూత్న, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, పశు వైద్యుడు, పంచాయతీరాజ్ ఏఈ, ఆరోగ్య అధికారి, ఏపిఎం, ఆర్ ఐ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అటవీ భూములను వీలైనంత త్వరలో సాంకేతికంగా పొందుపరచండి

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త): జిల్లాలోని ప్రభుత్వము భూములను పరిరక్షించుకొనుటకు, భూముల సర్వే ను పైలెట్ ప్రాజెక్టు క్రింద నిర్వహించి, కెఎంఎల్ మ్యాప్ (గూగుల్) లో పొందపరచాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో జిల్లాలోని భూముల సర్వే పై అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఖచ్చితమైన ప్రమాణాలతో జిల్లాలోని నిషేధిత భూములు, రక్షణ శాఖ, అటవీశాఖ, సీలింగ్ భూములు, అసైన్డ్ భూములు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన భూములను సర్వే చేసి, ఎలాంటి పొరపాటు లేకుండా పక్కాగా సర్వే నిర్వహించి, ఆ భూముల వివరాలను సాంకేతికంగా కిహెూల్ మార్కప్ లాంగ్వేజ్ (%KML%) మ్యాప్ (గూగుల్) లో త్వరిత గతిన పొందపరచాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. LRSలో భాగంగా లేవట్ల రెగ్యులరైజేషన్ బిల్డింగ్ పర్మిషన్స్ %TG% ఐపాస్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి %KML% మ్యాప్‌లో సూచించబడిన భూముల వివరముల ప్రకారము అనుమతులు ఇచ్చుటకు సులభతరం అవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ భూముల వివరములను మండల స్థాయి, రెవెన్యూ డివిజన్ స్థాయి, జిల్లా స్థాయిలలో శాశ్వత రికార్డుల గా సిద్ధం చేసి భద్రపరచాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రక్షణ శాఖ, అటవీశాఖ భూములకు సంబంధించి సరిహద్దులను గుర్తించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, తాసిల్దారులు, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

శామీర్ పేట, (గరుడ వార్త) : నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉండబోతోందని శామీర్ పేట విద్యుత్ ఏఈ సురేందర్ శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తూము కుంట విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డోమౌస్, బిట్స్ కాలనీలో, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్సీ కాలనీ, బ్యాంకు కాలనీలతో పాటు వ్యవసాయ పొలాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని శామీర్ పేట విద్యుత్ ఏఈ కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో సంస్కరణలు

కరీంనగర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో మార్పు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేలా అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. కొన్ని రోజుల కిందట సరళ భాషలో విద్యా బోధనకు నూతన పుస్తకాలను ముద్రించారు. వాటి బోధనకు హైదరాబాద్‌లో కొంతమంది ఎంపిక చేసిన అంగన్‌వాడీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన వారు మిగిలిన వారికి శిక్షణ ఇచ్చే పనిలో ఉన్నారు. తాజాగా పూర్వ ప్రాథమిక విద్యకు కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఏకరూప దుస్తులు అందించేందుకు అవసరమైన వస్త్రాలు సైతం ఇటీవల జిల్లా సంక్షేమ కార్యాలయానికి చేరాయి.

రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన బోధన

జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాల్లో వాటి పరిధిలో మూడు నుంచి ఆరేళ్లలోపు కేంద్రాలకు వచ్చే వారిలో 20,507 మంది చిన్నారులున్నారు. ముందుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఉన్న



అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ఏకరూప దుస్తులు అందించనున్నారు. వాటిని కుట్టే బాధ్యతను జిల్లా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పని చేస్తున్న మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున అంగన్‌వాడీ బాలలకు అప్పగిస్తారు. సరళ పదాలతో అంగన్‌వాడీ పిల్లలకు ప్రత్యేక సిలబస్‌తో రూపొందించిన పాఠ్య పుస్తకాలు సైతం జిల్లాకు చేరాయి. వీటిని త్వరలోనే అప్పగించనున్నారు. పూర్వ ప్రాథమిక విద్య కరదీపిక, ప్రియదర్శిని-1 పేరుతో వెలువడిన పుస్తకాలతో రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా బోధన ఉండేలా చర్యలు చేపడుతున్నారు.బలోపేతానికి చర్యలు- ఎం.సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్ఠం చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. టీచర్లకు నూతన పుస్తకాల పంపిణీతోపాటు పిల్లలకు ఏకరూప దుస్తులను కుట్టించి పంపిణీ చేస్తాం. కేంద్రాలకు వచ్చే బాలలకు నాణ్యమైన బోధన, పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

## అసంఘటిత రంగ కార్మికులే అధికం

పెద్దపల్లి : 'వలస కూలీలను పనిలో పెట్టుకొనే యాజమాన్యాలు వారి నడవడిక, నేర చరిత్ర గురించి స్వయంగా విచారణ నిర్వహించిన తర్వాతే ఉపాధి కల్పించాలి.' కార్మికుల నేర చరిత్ర తెలుసుకోవడం ద్వారా కొంతవరకు నేరాల నియంత్రణ సాధ్యమే అయినా ఉమ్మడి జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులే అధికంగా ఉండటంతో సాధ్యాసాధ్యాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వలస కూలీల గణాంకాలు కార్మిక శాఖ వద్ద అందుబాటులో ఉండటం లేదు. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ పనులు, భవన నిర్మాణ కూలీలు, పరిశ్రమల్లో పని చేసే సాంకేతిక నిపుణుల వరకు వివిధ రంగాల్లో 50 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో ఇటుకబట్టీల్లోనే పెద్దసంఖ్యలో కూలీలున్నట్లు అనధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

మారిన పరిస్థితులు

40 ఏళ్ల కిందట ఉమ్మడి జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలసలు ఎక్కువగా ఉండేవి. సాగునీటి వసతి అందుబాటులోకి రావడం, స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవడంతో క్రమంగా తగ్గిపోయాయి. అదే సమయంలో పదేళ్లుగా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి ఉపాధి పొందే కార్మికుల సంఖ్య పెరుగుతోంది. ఇక్కడి పరిశ్రమలతో పాటు అసంఘటిత రంగంలో పొరుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇందులో ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులు, గ్రానైట్ పరిశ్రమల్లోనే 80 శాతం మంది వలస కూలీలున్నారు.

స్పష్టమైన కార్యాచరణతోనే..

చిత్తశుద్ధి ఉంటే వలస కూలీల గణాంకాల సేకరణ, వారి నియంత్రణ పెద్ద సమస్యేమీ కాదు. కానీ ఏదైనా ఘటన జరిగినపుడే అధికారులు హడావుడి చేస్తూ మిగతా సమయాల్లో వదిలేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సీజన్‌ల వారీగా.. ఏడాది పొడవునా ఏయే రంగాల్లో వలస కూలీలు పని చేస్తున్నారో సంబంధిత శాఖల ద్వారా వివరాలు సేకరించడం సులభమవుతుంది. ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులు, ఇతర పరిశ్రమల్లో పని చేసే కార్మికుల వివరాల కోసం యాజమాన్యాలు ఏటా పనులు ప్రారంభించే సమయంలోనే అధికారులు కూలీల వివరాలు సేకరించాలి. నిర్మాణ రంగ కార్మికులు, ఇతర రంగాల కూలీలు, వారిని నియమించుకున్న యజమానులను గుర్తించాలి. వారి ద్వారా వివరాలు సేకరించి, గుర్తింపు కార్డులు జారీ చేయాలి. కార్మిక శాఖ గుర్తింపు కార్డు జారీ చేసిన వారినే పనిలో పెట్టుకోవాలనే నిబంధనను కఠినంగా అమలు చేయాలి. దీంతో వలస కార్మికుల పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉంటాయి. తద్వారా వారి నేర చరిత్రను కూడా ఆరా తీసే అవకాశం ఉంటుంది. కాట్నపల్లి ఘటనలో పోలీసులు వేగంగా స్పందించడంతో నిందితుడిని పట్టుకోగలిగారు. లేదంటే నిందితుడి ఆచూకీ కూడా దొరికేది కాదు. ఈ ఘటనకు పాల్పడిన బిహార్ కూలీ వద్ద మధ్యప్రదేశ్‌కు చెందిన మరో వ్యక్తి ఆధార్ కార్డు లభించింది. సీసీ కెమెరా ఫుటేజీ కూడా నిందితుడిని గుర్తించేంతగా స్పష్టత లేదు. అనుమతి లేనివే అధికంఉమ్మడి జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలైన బియ్యం మిల్లులు, గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించిన ఇటుక బట్టీలకు పరిశ్రమల శాఖ నుంచి అనుమతులు లేవు. పెద్దపల్లి జిల్లాలోని 150 బియ్యం మిల్లుల్లో కేవలం మూడింటికి మాత్రమే అనుమతి ఉండటం గమనార్హం. ఇక భవన నిర్మాణ కార్మికులు మినహా ఇతర అసంఘటిత రంగాల కార్మికులను గుర్తించే కనీస కార్యాచరణ కూడా కార్మిక శాఖ చేపట్టడం లేదు. వలస కార్మికుల సంక్షేమాన్ని కూడా ఆ శాఖ విస్మరించింది. గతంలో ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులకే పరిమితమైన వలస కూలీలు కొన్నేళ్లుగా వ్యవసాయ పనులకూ వస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, షాపింగ్ మాళ్లలో పని చేస్తున్నారు.నైపుణ్యం కలిగిన కార్మికులు భవన నిర్మాణం, ఇంటీరియర్ డిజైనింగ్, మగ్గం వర్క్, బంగారు అభరణాల తయారీ వంటి పనులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పౌల్ట్రీ, డెయిరీలతో పాటు మిల్లుల్లో ఆపరేటర్లు, ట్రాక్టర్లు, హార్వెస్టర్ల డ్రైవర్లుగానూ పని చేస్తున్నారు.

# గుత్తేదారు నిర్లక్ష్యం... ముందుకు సాగని పనులు

ఆలేరు : మండు వేసవిలో సైతం నిండి ఆయకట్టు కింద రెండు పంటలకు (ఖరీఫ్, రబీ) సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరందిస్తూ, దిగువన మూడు చెరువులను నింపుతూ.. మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి కల్పించే శాలిగౌరారం ప్రాజెక్టు శిథిలావస్థలో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులకు గాను ప్రస్తుతం 16 అడుగులకు చేరింది. ఈ సీజన్‌కు వారం రోజుల కింద ఆయకట్టుకు సాగునీరు విడుదల చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు గత ప్రభుత్వం రూ. 5.10 కోట్లను మంజూరు చేసి పనులు ప్రారంభించింది. సంబంధిత గుత్తేదారు చెరువు కట్ట మీద మట్టిపోసి చేతులు దులుపుకొన్నారు. ఆ మట్టి కూడా నాసిరకంగా పోయడంతో ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయి కోతకు గురైంది. పనులు పూర్తిచేయడానికి ఇచ్చిన గడువు ఏడాది క్రితమే పూర్తయింది. అయినా ఇప్పటికీ 70 శాతం పనులు చేయాల్సి ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

సత్యనారాయణ, డీఈ, ఐబీ

ప్రాజెక్టు మరమ్మతులకు రూ. 5కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పినా గుత్తేదారు నిర్లక్ష్యం వీడటంలేదు. కాల్వ పనులు కూడా సక్రమంగా చేయలేదు. ఈ



విషయంపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సంబంధిత గుత్తేదారుకు నోటీసులు జారీ చేశాం. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

చేయాల్సిన మరమ్మతులు..

ప్రాజెక్టు కట్టపై కంపచెట్లు తొలగించి, మట్టిపోసి కట్టను పటిష్టం చేయాలి పల్లివాడ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు వరకు గల రాచకాల్వకు మరమ్మతులు చేసి, శుభ్రం చేయాలి

రాచకాల్వపై మూడు ఎస్ఎల్ఆర్ బ్రిడ్జిలు నిర్మించి, కాల్వకు ఇరువైపులా బలహీనంగా ఉన్న కట్ట వద్ద సీసీతో రక్షణ గోడలు నిర్మించాలి.

ప్రాజెక్టు కుడి కాల్వ ఆరు కిలోమీటర్ల మేర శుభ్రం చేసి చివరి భూములకు సాగునీరందించాలి.

చేసినవికట్టపై ఉన్న కంపచెట్లను పూర్తిస్థాయిలో తొలగించలేదు. నామమాత్రంగా మట్టిపోయడంతో వర్షానికి కొట్టుకుపోయి కోతకు గురైంది.రాచకాల్వ 13 కి.మీ మేరకు మాత్రమే శుభ్రం చేశారు. కాల్వ నిండా కంపచెట్లతో అధ్వానంగా తయారైనా పూర్తిస్థాయిలో పనులు చేయకుండా వదిలేశారు.ప్రాజెక్టు కట్టపై చెట్లు తొలగించి, తూతూ మంత్రంగా పోసిన మట్టికే గుత్తేదారు రూ. 2కోట్ల వరకు బిల్లు తీసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

## రైతు వేదికల్లోకి ఎరువులొచ్చేనా..?

ఆలేరు : పంటల సాగులో ఆధునిక పద్ధతులను జోడిస్తూ విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. భిన్నమైన పంటల సాగు, భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన లేని పరిస్థితి. కర్షకులకు అధికారులు అందుబాటులో ఉండి మెలకువలు అందించాలనే ఉద్దేశంతో గత భారాస ప్రభుత్వం నల్గొండ ఉమ్మడి జిల్లాలో రూ. 78.05 కోట్లు వెచ్చించి 314 రైతు వేదికలు నిర్మించింది. వీటిని ఎరువుల విక్రయ కేంద్రాలుగా మార్చాలని నిర్ణయించింది. అంతలోనే ఎన్నికలు రావడంతో అమల్లోకి రాకుండా పోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వేదికల్లోనే వ్యవసాయ శాఖాపరంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వీటితోపాటు మరిన్ని సేవలనూ అందుబాటులోకి తీసుకురావాలని అన్నదాతలు ఆశిస్తున్నారు.

గత నిర్ణయాలు ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంటల సాగుకు అవసరమైన ఎరువులను సగం మేర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్), ఆగ్రోస్ కేంద్రాలు, డీసీఎంఎస్, హాకా సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే నిర్ణీత ధరలకు సరఫరా చేస్తోంది. మిగతా యాభైశాతం ఎరువుల విక్రయాలు ప్రైవేటు దుకాణాల ద్వారా సాగుతున్నాయి. రైతు వేదికల్లో వసతులు ఉండటంతో ఎరువులనూ విక్రయించాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏ క్లస్టర్ పరిధిలోని రైతులు అదే క్లస్టర్ రైతు వేదికల ద్వారా ఎరువులు తీసుకునేందుకు అనువుగా ఉంటుందని



భావించారు. ఇది విజయవంతమైతే విత్తనాలు కూడా విక్రయించడానికి సంసిద్ధంగా ఉన్నట్లు నాడు పాలకులు ప్రకటించారు. ఎరువుల నిల్వలు, భద్రత, రవాణా తదితర అంశాలను డీసీఎంఎస్‌లకు అప్పగించాలనుకున్నారు. ప్రభుత్వం మారిన క్రమంలో నాటి నిర్ణయాలు కార్యరూపం దాల్చలేదు. ఎరువులు, విత్తనాల విక్రయాలు, భూసార పరీక్షల జాడ లేకుండా పోయింది. కొన్ని చోట్ల రైతు వేదికలు తెరచుకోవడం లేదు. వేదికల నిర్వహణకు అందాల్సిన నిధులు సకాలంలో మంజూరు కాకపోతుండటంతో ఇవి అధికారులకు భారంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో

సాగు విస్తీర్ణం.. ఎరువుల అవసరం..

| జిల్లా | రైతులు | రైతు వేదికలు | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) | ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో) |
|---|---|---|---|---|
| నల్గొండ | 4,21,278 | 140 | 9,82,192 | 1,64,301 |
| సూర్యాపేట | 3,30,326 | 82 | 7,26,482 | 1,34,112 |
| యాదాద్రి | 1,57,206 | 92 | 6,65,000 | 80,954 |

# సీఎంఆర్ ధాన్యం ఏమైంది?



హుజూరాబాద్: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద ధాన్యాన్ని మరాడించి బియ్యాన్ని తిరిగి అప్పగించడంలో కొందరు మిల్లర్లు ముప్పు తిప్పలు పెడుతున్నారు. బియ్యమైనా తిరిగి ఇవ్వండి.. లేదా దానికి సరిపడా డబ్బులైనా చెల్లించాలని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా.. మిల్లర్లకు నోటీసులు జారీ చేస్తున్నా.. 2021-22లో బకాయి అప్పగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

1,31,262 క్వింటాళ్ల బియ్యం బకాయి

జిల్లాలో 2020-21 వానాకాలం, యాసంగి సీజన్లలో సుమారు 7,03,508 మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ కింద కేటాయించారు. ధాన్యాన్ని మరాడించి ముడి బియ్యం క్వింటాకు 67 కిలోలు, బాయిల్డ్ బియ్యం క్వింటాకు 68 కిలోల చొప్పున తిరిగివ్వాలి కానీ.. నాలుగేళు పూర్తయినా ఆశించిన ప్రగతి లేదు. జిల్లాలో 58 మంది మిల్లర్లు తమకు కేటాయించిన 16,25,236 క్వింటాళ్ల ధాన్యాన్ని మరాడించి 10,81,900 క్వింటాళ్ల బియ్యం తిరిగివ్వాల్సి ఉంది. ఇప్పటివరకు 3,49,950 క్వింటాళ్ల బియ్యం మిల్లర్ల వద్దే ఉండిపోవడంతో పౌరసరఫరాల సంస్థ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. స్పందించకపోవడంతో 25 శాతం జరిమానాతో కలిపి 4,37,438 క్వింటాళ్ల బియ్యం తిరిగివ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. పలువురు మిల్లర్లు 3,06,176 క్వింటాళ్ల బియ్యాన్ని 100 శాతం తిరిగి అప్పగించారు. ఇంకా 43,774 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాల్సి ఉంది. దీనికి 25 శాతం జరిమానాతో కలిపితే 1,31,262 క్వింటాళ్ల బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. జిల్లాలో సీఎంఆర్ బకాయి పడిన వారిలో 58 మంది మిల్లర్లు ఉన్నారు. వీరందరిని డిఫాల్టర్లుగా అధికారులు గుర్తించినా ఇందులో కొందరికి ఆ తర్వాతి సీజన్ల సీఎంఆర్ ధాన్యం కేటాయించడం గమనార్హం.


**మిల్లుల్లో నిల్వలేవీ?**

ఒక సీజన్‌లో సీఎంఆర్ కింద తీసుకున్న ధాన్యాన్ని మరాడించి మరో సీజన్ ధాన్యం వచ్చే సమయానికి కంటే ముందే బియ్యం తిరిగి అప్పగించాలి. 2021-22 వానాకాలం, యాసంగి సీజన్‌లు ముగిసి నాలుగేళ్లు పూర్తయినా వేలాది క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడంలో మొండికేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం మిల్లర్ల వద్ద ధాన్యం లేకపోవడమే.. ఈ మేరకు హుజూరాబాద్‌కు చెందిన సత్యనారాయణ అనే వ్యాపారి మిల్లును లీజుకు తీసుకొని 2021-22 వానాకాలం సీజన్‌లో 3,870 క్వింటాళ్ల ధాన్యం, 2022-23 వానాకాలంలో 3,445 క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా మొత్తంగా రూ. 2.50 కోట్ల విలువైన 5,753 క్వింటాళ్ల ధాన్యం మాయం చేశాడు. ఈ మేరకు కేసు కూడా నమోదు చేశారు. లీజుకు తీసుకున్న వ్యాపారి ఆచూకీ లేకపోవడంతో మిల్లు యజమాని సమ్మిరెడ్డికి నోటీసులు జారీ చేయడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. లా 2021-22లో సీఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లర్లు మరాడించిన బియ్యాన్ని అమ్ముకొని సొమ్ము చేసుకోవడం వల్లే నాలుగేళ్లు దాటినా బకాయిలు తిరిగివ్వడం లేదని తెలుస్తోంది.

**యథేచ్ఛగా పక్కదారి..**

గత డిసెంబరులో టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంటలోని ఆరు మిల్లులను తనిఖీ చేశారు. 2022-23 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి సీఎంఆర్ కింద 5.41 లక్షల క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా 2.66 లక్షల క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ. 52.13 కోట్లు పైగానే ఉంటుంది. నిరంతరం తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే మిల్లుల్లోని సీఎంఆర్ ధాన్యం పక్కదారి పడుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇదే అదనుగా మిల్లర్లు సీఎంఆర్ ధాన్యాన్ని యథేచ్ఛగా పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు.

# దరఖాస్తు ఇవ్వు.. పరిష్కారం సులువు




భగత్‌నగర్: నగరంలోని ముకరాంపురానికి చెందిన భాస్కర్ అనే విద్యుత్తు వినియోగదారునికి గత జూన్ 20న రూ. 35,112.45 విద్యుత్తు బిల్లు రావడంతో మరుసటిరోజు స్థానిక సెక్షన్ కార్యాలయంలో ఏఈకి ఫిర్యాదు చేశారు. తాను సోలార్ నెట్ మీటర్‌ను వాడుతున్నానని.. తిరిగి తనకే డబ్బులు రావాల్సి ఉంటుందని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం రాలేదు. జులై 15న విద్యుత్తు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రీడింగ్ నమోదు సమయంలో మైనస్‌కు బదులు ప్లస్ వేయడంతో భారీ మొత్తంలో బిల్లు వచ్చిందని.. కనిష్ఠ బిల్లు రూ. 1,552 చెల్లించాలన్నారు. దీంతో భాస్కర్ సమస్య పరిష్కారమైంది. ఇలా జిల్లాలో వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ ఫిర్యాదులు స్వీకరించడానికి ఏర్పాట్లు చేశారు. ఎక్కువ ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదులు వస్తుండడం విశేషం. ఈ కార్యక్రమం ప్రారంభించిన రెండు నెలల్లో 269 ఫిర్యాదులు రాగా.. ఇప్పటికే 216 పరిష్కారమయ్యాయి.

**ఎదురుచూపులకు చెక్..**

గతంలో సెక్షన్ కార్యాలయానికి వెళితే సంబంధిత ఏఈ ఉంటేనే ఫిర్యాదును స్వీకరించేవారు. ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియకపోవడంతో అధికారుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆయా కార్యాలయాలకు నిర్ణీత సమయాన్ని నిర్దేశించి ఫిర్యాదులు స్వీకరించేలా ఏర్పాటు చేశారు. సమస్య అక్కడా పరిష్కారం కాకపోతే జిల్లా కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్ఈ.. విద్యుత్తు ప్రజావాణి నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 198 ఫిర్యాదులు అందితే అందులో 159 పరిష్కరించారు.

**ఆన్‌లైన్‌లో ఇలా..** వినియోగదారుడు స్వయంగా కార్యాలయానికి రాలేని పరిస్థితిలో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించారు. దీనికోసం ప్లే స్టోర్ నుంచి టీజీ ఎన్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో 'కన్స్యూమర్ గ్రీవెన్స్' ఆప్షన్‌ను ఎంచుకొని కొత్త ఫిర్యాదు(న్యూ కంప్లెంట్)ను ఎంచుకోవాలి. అనంతరం ఆంగ్లం, తెలుగు భాషల్లో మీ వద్ద యూనిక్ సర్వీసు ఉందా? అంటూ ప్రశ్నిస్తుంది. ఉంటే ఉందని, లేదంటే లేదని ఎంచుకున్న అనంతరం జిల్లా, కార్యాలయం, మెయిల్, ఫోన్ నెంబర్ వివరాలు నమోదు చేయాలి. అనంతరం సమస్య ఏంటో ఎంచుకొని ఫిర్యాదును టైప్ చేయాలి. ఈ ఫిర్యాదు అధికారులకు చేరుతుంది. వారు సమస్యను పరిష్కరించడం లేదా తిరస్కరించడం చేస్తారు. తిరస్కరించిన దానిని మళ్లీ ఫిర్యాదు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

# వన మహోత్సవానికి కార్యాచరణ



కరీంనగర్ : జిల్లాలోని పురపాలికల పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్మాత్మకంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే పలు చోట్ల మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది. గత కొన్నేళ్లుగా హరితహారం పేరుతో పెద్ద ఎత్తున నాటించారు. ప్రభుత్వ స్థలాల్లో పట్టణ ప్రకృతి వనం పేరుతో నాటించగా పచ్చదనం పర్చుకుంది. విడతల వారీగా నాటినవి ఏపుగా పెరిగాయి. ఈ ఏడాది కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లిలో మొత్తం 6.40 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యాన్ని విధించింది.

**నరకడం కాదు.. పెంచాలి**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా భూతాపం తగ్గాలన్నా.. సకాలంలో వర్షాలు కురవాలన్నా చెట్లు ఉండాల్సిందే. అలాంటిది గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, విద్యుత్తు తీగలకు అడ్డుగా వస్తున్నాయనే రకరకాల కారణాలతో నరికి వేస్తున్నారు. నగరంలో అయితే నిలువ నీడ లేకుండా పోతుంది. ఎండాకాలంలో సిమెంటు రహదారుల నుంచి వచ్చే వేడి విపరీతంగా ఉండటంతో ఉక్కిరిబిక్కిరి కావాల్సిన పరిస్థితి వస్తోంది. చెట్లు ఉన్న ప్రాంతాల్లో, లేని చోట్ల ఒకసారి బేరీజు వేసుకుంటే ఎలా ఉంటుందో తెలుస్తోంది. ప్రతి ఒక్కరూ పెంచేందుకు ఆసక్తి చూపించాలి తప్ప.. నరికేందుకు కాదనే విషయాన్ని గమనించాలి. ఇంటింటా పండ్లు, పూల మొక్కలు పంపిణీ చేయనున్నారు. కరీంనగర్‌లో సుమారు 2 లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. సెంట్రల్ నర్సరీతోపాటు మిగతా చోట్ల ఉన్న నర్సరీల్లో వీటిని పెంచారు. వీటిని డివిజన్లకు తరలించేందుకు సిద్ధంగా ఉంచారు.

ఇంటింటా పంపిణీ చేసేవిచామంతి, జర్మన్ చామంతి, నందివర్ధనం, మందార, కలబంద, మలబార్, మల్లే, రెడ్ ఖలీఫా, గ్రీన్ ఖలీఫా, క్రోటోన్స్, బోగన్‌విల, నూర్ వరహాలు, బ్లాక్ ఖలీఫా, గులాబీ, గడ్డి గులాబీ, లాంటిన్, జామ, దానిమ్మ, ఉసిరి, సీతాఫలం, మునగ, కరివేపాకు, బ్లాక్ గ్రాప్స్, మనీ ప్లాంట్స్, నిమ్మ, బాదం, లిల్లీ, కర్జూర, పారిజాతం, గన్నేరు, కనకంబరాలు నైట్‌హౌస్, చక్రం మల్లె, బట్టర్‌ఫ్లై ప్లాట్స్, లవంగం తులసీ, మారేడు, తులసీ, శ్రీగంధం, బంతి, వాటర్ యాపిల్ వంటి మొక్కలు వివిధ నర్సరీల్లో పెంచారు. వీటిని త్వరలోనే పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

# మాఫీ అయ్యేనా..?

గరిడేపల్లి : రుణమాఫీపై స్పష్టత లేకపోవడంతో రైతులు, అధికారులు అయోమయ స్థితిలో పడ్డారు. అటు బ్యాంకులు, ఇటు వ్యవసాయ శాఖ మాఫీ ఎందుకు కావడం లేదనే విషయంపై సరైన మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో వ్యవసాయ శాఖ లాగిన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడానికే పరిమితమవుతున్నారు. మరోవైపు వ్యవసాయ శాఖ పరిధిలో బదిలీల ప్రక్రియ సాగుతుండటంతో బిజీగా ఉండి రైతులకు సరైన స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. లక్ష, లక్షన్నర మాఫీ విషయంలోనూ చాలా మంది రైతులకు అర్హత ఉండీ మాఫీ కాలేదు. ఎందుకు కాలేదనే విషయం అధికారులు వారి లాగిన్‌లో ఓపెన్ చేస్తే పదికిపైగా కారణాలు కన్పిస్తున్నాయి.

కారణాలివి..

ప్రధానంగా రుణమాఫీకి బ్యాంకుల్లోని ఖాతాకు ఆధార్ అనుసంధానం కీలకం. దాంతో పాటు రైతుకు ఉన్న రుణం ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉందా లేదా అనేదీ ముఖ్యమే. వ్యవసాయ శాఖ లాగిన్‌లో



మండల అధికారులు, విస్తరణాధికారులు చూస్తే నో డేటా ఫౌండ్ అని, కుటుంబ సభ్యుల నిర్ధారణ కాలేదని వస్తోంది. ఎక్కువగా ఈ రెండే ప్రధాన కారణాలు కాగా ఆధార్‌కార్డులో ఉన్న పేరుకు బ్యాంకు ఖాతా పేరుకు సంబంధం లేదని వస్తోంది.

ముఖ్యంగా మహిళల పేరున ఉన్న ఖాతాలకే ఇది సమస్యగా ఉంది. ఎందుకంటే చాలా మంది మహిళలు ఇక్కడ రుణాలు తీసుకుని అత్తగారింటికి వెళ్లాక ఇంటి పేరు మార్చుకోవడంతో రెండింటికీ తేడా ఉందని, మాఫీలో పేరు లేకుండా పోతోంది. ఒకే పేరు ఉన్న వారి ఆధార్ కొడితే ఒకరిది మరొకరి ఖాతాలో చూపిస్తోంది. అది పెండింగ్ పెట్టారు. అదే విధంగా ఒకే పేరు ఉన్న వారికి వేర్వేరు బ్యాంకుల్లో ఖాతాలు ఉంటే ఒకరి ఖాతాకు వేరే వారి మాఫీ వచ్చింది.

ఉదాహరణకు ధన అనే మహిళకు కెనరా బ్యాంకులో రుణం ఉంది. అదే పేరు ఉన్న మరో మహిళకు ఏపీజీవీబీలో ఖాతా ఉంది. కెనరా బ్యాంకులో రుణం ఉన్న మహిళకు మాఫీ రాలేదు. ఆ మాఫీ సొమ్ము ఏపీజీవీబీలో ఉన్న ధన అనే మహిళ ఖాతాలో జమయ్యాయి. ఇలాంటివి చాలా ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అనేక కారణాలతో రుణమాఫీ సొమ్ము అసలు లబ్ధిదారులకు చేరడం లేదు.

సందిగ్ధంలో రైతన్న: భారాస ప్రభుత్వం చేసిన కుటుంబ సర్వే, ఇతర సర్వేలను ప్రామాణికంగా తీసుకొని ఉన్నతాధికారుల స్థాయిలోనే స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. కాగా కొత్తగా మరో సమస్య వస్తోంది. 2017-18 సంవత్సరం వరకు పాత పట్టాదారు పాసుపుస్తకాలు పెట్టి పంట రుణాలు తీసుకున్నారు. ఆ తర్వాత వాటినే రెన్యువల్ చేసుకుంటూ వస్తున్నారు. 2018 తర్వాత వచ్చిన కొత్త పుస్తకాలను బ్యాంకులో తాకట్టు పెట్టలేదు. కొద్దిమంది రైతులే కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పెట్టారు. అలా పెట్టని వారికి వ్యవసాయ శాఖ లాగిన్‌లో భూమి లేదని వస్తోంది. అలాంటి వారికి రుణమాఫీ వర్తిస్తుందా లేదా అనేది సందిగ్ధంలో పడిందని అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి పదికి పైగా సమస్యలు చూపిస్తున్నాయని, రైతులు నిత్యం కార్యాలయాలకు, బ్యాంకులకు వచ్చి చెప్పులరిగేలా తిరుగుతున్నారని అధికారులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్గదర్శకాలు రాలేదు: శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

లాగిన్‌లో అనేక సమస్యలు కన్పిస్తున్న మాట వాస్తవమే. వాటిపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు. వచ్చిన తర్వాత రేషన్‌కార్డు లేదా కుటుంబ గుర్తింపు చేపడతాం.

# మీనమేలనోయి..!

భానుపురి : చేప పిల్లల పంపిణీపై పీటముడి వీడటం లేదు. జిల్లా మత్స్యశాఖ అధికారులు రెండుసార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. అదను దాటుతుండటంతో మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వం ఆగస్టు నుంచే జల వనరుల్లో చేప పిల్లలను వదిలింది.

ఈ సారి ఈ పథకం అమలుపై సందిగ్ధం నెలకొనగా.. చివరకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జులై 10, 23 తేదీల్లో టెండర్లు పిలిచారు. రెండుసార్లూ గుత్తేదారులు ఆసక్తి చూపలేదు.

**అనువైన సమయం ఇదే..**

చెరువుల్లో చేప పిల్లలను పోయడానికి ఇదే అదుదైన సమయం. జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవలేదు. కానీ, ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని నీటి వనరుల్లోకి కొంత నీరు చేరింది. ఈ సారి మీనాలను వదిలేందుకు మత్స్యశాఖ అధికారులు ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,431 చెరువులను ఎంపిక చేశారు. వీటిల్లో 12.12 కోట్ల చేప పిల్లలు విడుదల చేసేందుకు జిల్లా మత్స్యశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే రెండుసార్లు టెండర్ పిలిచినా గుత్తేరులు ముందుకురాకపోవడంతో ఆ గడువును ఈ నెల 13 వరకు పెంచారు. గతేడాది విడుదల చేసి చేప పిల్లలకు సంబంధించి గుత్తేదారులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. మళ్లీ టెండర్‌లో పాల్గొనాలంటే టెండర్ ఫీజు, ఈఎండీ, చేప పిల్లల కొనుగోలు, రవాణా తదితర వాటికి పెట్టుబడి అవసరం. ప్రభుత్వం పాత బకాయిలు విడుదల చేసే వరకు టెండర్‌లో పాల్గొనకుండా గుత్తేదారులు మిన్నకుంటున్నట్లు సమాచారం.

**గుత్తేదారులు రాకపోవడమే కారణం**

చరిత, జిల్లా ఇన్‌ఛార్జి , మత్స్యశాఖ అధికారి, సూర్యాపేట

చేప పిల్లల టెండర్లకు గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించడంతో ఈ నెల 13 వరకు వాయిదా వేశారు. గుత్తేదారులు ముందుకొచ్చిన వెంటనే చెరువుల్లో చేప పిల్లలు వదులుతాం. మత్స్యకారులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. **ఆలస్యమైతే అనర్థాలివి..** ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలో 592 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. వీటిల్లో 52,366 మంది సభ్యులుగా ఉన్నారు. వీరు నిత్యం మీనాల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఉచితంగా పోసే చేప పిల్లలే వీరి ఉపాధికి మార్గం నిలుస్తోంది. ప్రస్తుతం వర్షాలకు చేరిన మట్టినీటితో మీనాలకు ఆహార లభ్యత ఉంటుంది. నీరు తేటగా మారాక ఆహార కొరత ఏర్పడుతుంది. ఆలస్యంగా మీనాలను వదిలితే అవి పెరిగే సమయానికి మార్చి నుంచి ఎండలు కాసి నీళ్లు ఇంకిపోతాయి. ఫలితంగా వాటి ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. పాలకులు స్పందించి చేప పిల్లలను త్వరగా విడుదల చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

# యంత్రాల వినియోగం ఎంత?

సారంగాపూర్: ఇటీవల వర్షాలతోపాటు జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. దోమల నియంత్రణతోపాటు తాగునీటి నాణ్యత పరీక్షలు నిర్వహించేందుకు పంచాయతీలకు అందించిన పరికరాలు నిరుపయో గంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.50 లక్షలు వ్యయం చేసి పిచికారీ యంత్రాలతోపాటు చేసే దోమల నివారణ మందులను పంచాయతీలకు అందించారు. ప్రస్తుతం గ్రామాల్లో దోమల తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ఫాగింగ్ చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

**తాగునీటి నాణ్యత పరీక్ష కిట్లు ఎక్కడ?**

మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ నీటి సరఫరా లేకపోవడంతో స్థానికంగా బోర్లు, బావుల ద్వారానే నీటిని అందిస్తున్నారు. తరచూ గేట్‌వాల్వులు, పైపులైన్ల లీకేజీలతోపాటు మంచినీటి ట్యాంకులలో అపరిశుభ్రతతో నీరు కలుషితమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో నీటి నాణ్యతను పరీక్షించేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా క్లోరో స్కోప్(తాగు నీటి నాణ్యత)కిట్లను పంచాయతీలకు



అందించారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ పంచాయతీలు పరీక్షలు నిర్వహించడం లేదు. అంతేకాకుండా కనీసం రక్షిత మంచినీటి బావులు, ట్యాంకులు, ఇళ్లలోని బావులలోనూ క్లోరినేషన్ చేయడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**వివరాల నమోదులో నిర్లక్ష్యం**

రక్షిత మంచినీటి ట్యాంకులు, బోరుబావులు, చేతి పంపులు తదితర తాగునీటి వనరుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా కనిపించడంలేదు. నీటి వనరుల పరీక్ష నివేదిక ఆధారంగా నీరు తాగేందుకు పని కొస్తుందా..? లేదా అన్న విషయాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. నాణ్యతలో వ్యత్యాసం ఉంటే ఆ ప్రాంతంలో ప్రత్యామ్నాయ వనరులతో తాగునీటిని అందించాల్సి ఉంటుంది. ఒక్కో నీటి వనరు వద్ద మూడు చోట్ల పరీక్షలు చేయడమే కాకుండా గ్రామంలోని రక్షిత మంచినీటి పథకాన్ని నెలలో మూడు సార్లు శుభ్రం చేయించాలి. వీటన్నింటిని పాటించినప్పుడే ప్రజలకు శుద్ధ జలం అందే అవకాశముంది. గతంలోనూ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో పంచాయతీలకు నీటి నాణ్యత కిట్లను అందజేశారు. చాలా చోట్ల పరీక్షలు చేయకుండానే మూలన పడేశారు.

# సర్కారు బడులకు జీరో విద్యుత్తు బిల్లు

కరీంనగర్ : గత కొంతకాలంగా ప్రభుత్వ పాఠశాలల సమస్యల్లో విద్యుత్తు బిల్లులు ఒకటి. రాష్ట్ర ప్రభుత్వం ఏటా తీసుకొస్తున్న సంస్కరణలు, బోధన సౌకర్యాలతో విద్యుత్తు వాడకం పెరుగుతుంది. పాఠశాలల నిర్వహణ నిధులు సరిపోక బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని మెజారిటీ పాఠశాలలు వేల రూపాయల బిల్లులు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సీఎం ప్రకటనతో ఉమ్మడి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**రూ. వేలల్లో బకాయిలు** మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల కార్యక్రమాల ద్వారా ఉమ్మడి జిల్లాలోని సర్కారు బడుల్లో ఫ్యాన్లు, లైట్లు, బోర్‌పంపులు, శుద్ధజల ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇంతకుముందే డిజిటల్ విద్యలో భాగంగా ప్రొజెక్టర్లు, కంప్యూటర్లు పాఠశాలల్లో ఉన్నాయి. మరో వైపు అధికారులు పాఠశాలలకు కేటగిరీ–7ఏ కింద విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. పాఠశాలల్లో సెలవుల్లో మినహా కరెంటు వాడకం తప్పనిసరి కావడంతో బిల్లులు పెరుగుతున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నెలకు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు.. ఉన్నత పాఠశాలల్లో గదులు, డిజిటల్ తెరలు, విద్యార్థులు ఎక్కువ ఉండటంతో రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు.. కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు విద్యుత్తు బిల్లులు వస్తున్నాయి. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్ల నిర్వహణ నిధులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నారు.



**నిర్వహణకు సరిపోని నిధులు..**

సర్కారు పాఠశాలలకు ప్రభుత్వం ఏటా విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు నిర్వహణ నిధులు అందిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రూ.50 వేల నిధులిచ్చే పాఠశాలలు తక్కువగా ఉండగా.. రూ.10 వేలు, రూ.25 వేలు వచ్చేవి అధికంగా ఉన్నాయి. ఈ నిధులు జాతీయ పండుగలు, కంప్యూటర్లు, ల్యాబ్‌ల నిర్వహణ, స్టేషనరీ, విద్యుతు బిల్లులు, చిన్నచిన్న మరమ్మతులు, నెట్ ఛార్జీలు, తాగునీరు తదితర సదుపాయాలకు సరిపోవడంలేదని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. విద్యుత్తు బిల్లులు చెల్లిస్తే మిగిలిన వాటికి ఒక్క పైసా కూడా మిగలడం లేదని వాపోతున్నారు. దీంతో పెద్దమొత్తం విద్యుత్తు బిల్లులు బకాయిలుగా పేరుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో పాఠశాలల నిర్వహణకు నిధుల కొరత తప్పనుంది.

**సంతోషకర విషయం**సర్కారు బడులకు ఉచిత విద్యుత్తు అందిస్తామని సీఎం నిర్ణయం ఉపాధ్యాయుల్లో సంతోషాన్ని నింపింది. ఎన్నో ఏళ్లుగా ప్రధానోపా ధ్యాయులు ఇదే విషయాన్ని ప్రభుత్వాల ముందుంచుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో బిల్లుల సమస్య తీరడంతోపాటు పాఠశాలల నిధులను ఇతర అవసరాలకు వాడుకునే వీలుంది.– కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం

# పర్యావరణహితానికి ఈపీఆర్



హైదరాబాద్ : ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రవేశపెట్టిన 'ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబులిటీ (ఈపీఆర్)' సత్ఫలితాలనిస్తోంది. ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేసే, వాటిని ప్రాసెస్ చేసే సంస్థలకు 100శాతం రీసైక్లింగ్ బాధ్యతను అప్పగించడంతో కాలుష్యానికి అడ్డుకట్టపడుతోంది. ప్రతి సంస్థ సీపీసీబీ రూపొందించిన ఈపీఆర్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని మార్గదర్శకాలు విడుదల చేయగా ఇప్పటి వరకు రాజధాని పరిధిలోని 300 సంస్థలు ఇందులో చేరాయి. ప్లాస్టిక్ తయారీ సంస్థలతోపాటు ప్లాస్టిక్ వేస్ట్ ప్రాసెసర్స్ (సీడబ్ల్యూపీ) యూనిట్లు ఉన్నాయి. భూమిలో త్వరగా కరిగిపోయే (బయోడీగ్రేడబుల్) కంపోస్టబుల్ ప్లాస్టిక్ యూనిట్లు సైతం ఈపీఆర్‌లో రిజిస్టర్ అవ్వాలని సూచించడంతో పదుల సంఖ్యలో సంస్థలు రిజిస్టర్ అయ్యాయి.

ఇవీ నిబంధనలు... ఉత్పత్తిదారుల వస్తువుల వల్ల మార్కెట్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించే బాధ్యతను అవే సంస్థలకు ఈపీఆర్ ఆథరైజేషన్ ద్వారా సీపీసీబీ అప్పగించింది. ఇలా ఏటా ఉత్పత్తయ్యే ప్లాస్టిక్‌ను వారే సేకరించి రీసైక్లింగ్ కేంద్రాలకు పంపాలని ఉత్పత్తి ఆధారంగా లక్ష్యాలను నిర్దేశిస్తోంది. ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లు కూడా సేకరించిన వ్యర్థాలకు సంబంధించి 'ఈపీఆర్ సర్టిఫికేట్'ను జారీ చేస్తారు. ఉత్పత్తిదారులు ఈ వివరాలన్నింటినీ ఈపీఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. రీసైక్లింగ్ యూనిట్ల నిర్వాహకులు సైతం రీసైక్లింగ్ ప్లాస్టిక్‌ను బయట విక్రయించినా సంబంధిత జీఎస్టీ ఇన్‌వాయిస్‌లు, వేబ్రిడ్జి స్లిప్‌లను అప్‌లోడ్ చేయాలి. లక్ష్యం చేరుకోకపోతే తర్వాతి ఏడాది పూర్తి చేయాలి. ఉదా: ఓ సంస్థ 100 టన్నుల వ్యర్థాలకు బదులు 75 టన్నులు రీసైక్లింగ్ కేంద్రాలకు పంపితే తర్వాతి ఏడాదిలో వచ్చే లక్ష్యానికి అదనంగా 25 టన్నులు పూర్తి చేయాల్సి ఉంటుంది. రీసైక్లింగ్ సంస్థలు సైతం డూప్లికేట్ రశీదులు, జీఎస్‌టీ బిల్లులు సమర్పిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. గతంలో మహారాష్ట్రలో ఓ రీసైక్లింగ్ కేంద్ర నిర్వాహకుడు నకిలీ బిల్లులు సమర్పిస్తే గుర్తించిన సీపీసీబీ రూ.50కోట్ల వరకు జరిమానా విధించింది.

ఆడిట్ తప్పనిసరి...ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రక్రియ మొత్తానికి ప్రతి ఆరు నెలలకోసారి ఆడిట్ నిర్వహించి పొరపాట్లు చేసినవారిపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆడిట్‌లో భాగంగా ఉత్పత్తి, రీసైక్లింగ్ సామర్థ్యంపై భౌతికంగా అధికారులు పరిశీలిస్తారు. ఎన్ని టన్నులు రీసైక్లింగ్ చేయొచ్చని క్యాపింగ్ ఇస్తారు. అప్పుడే రీసైక్లింగ్ కేంద్రాలు సర్టిఫికేట్ జారీ చేసే అర్హతను నిర్ణయించి అనుమతి జారీ చేస్తారు.

# అందుతున్న రుణం.. మహిళల అభివృద్ధి పథం



తాండూరు : ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏటా రూ.వందల కోట్ల రుణాల్ని మంజూరు చేస్తోంది. వాటిని సద్వినియోగం చేస్తూ ఆసక్తి ఉన్న రంగంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దీర్ఘకాలంలో ప్రయోజనాలు పొందుతున్నారు. ఆర్థిక స్థిరత్వం సాధిస్తు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**రెండు నెలల్లోనే 23 శాతం మేర పంపిణీ**

జిల్లాలోని 20 మండలాల పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు మహిళా సమాఖ్య ద్వారా, నాలుగు పట్టణాల పరిధిలో మెప్మా ద్వారా రుణాలు అందజేస్తున్నారు. ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం నిర్దేశించుకుని రుణాలు పంపిణీ చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు నెలల్లోనే 23 శాతం రుణాల పంపిణీ లక్ష్యం పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంత మహిళలున్న 13,138 సంఘాలకు రూ.554.49కోట్లు రుణాలు అందించేందుకు ఖరారు చేశారు. ఎంపీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో జూన్, జులై మాసాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు రుణాల పంపిణీపై దృష్టిసారించారు. 1,334 సంఘాల్లోని మహిళలకు రూ.127.83కోట్లు రుణాలు పంపిణీ చేశారు. సంఘాల్లోని 13వేలకుపైగా మహిళలకు ఆర్థిక ప్రయోజనం చేకూరింది.

**కూతురిని డాక్టర్ చదివిస్తున్నా..**

తొలుత కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేందుకు ఇబ్బందులు పడ్డా. 2007లో డ్వాక్రా సంఘంలో నెలనెలా పొదుపు చేయడంతో బ్యాంకు అధికారులు రుణం మంజూరు చేశారు. దాంతో కిరాణ దుకాణం ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నా. వచ్చిన ఆదాయంతో కూతురును చదివించా. ఎంబీబీఎస్ సీటు రావడంతో ఆగ్రాలో వైద్య విద్యనభ్యసిస్తోంది.

జగదేవి, డ్వాక్రా మహిళ, ఓగీపూర్.

**పంచాయతీ కార్యదర్శిని చేశా..**

డ్వాక్రా సంఘంలో 2005లో చేరా. బుక్‌కీపర్, అధ్యక్షురాలిగా కొనసాగుతున్నా. సంఘం ద్వారా మంజూరైన రుణం పెట్టుబడిగా పెట్టి వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నా. వచ్చిన ఆదాయంతో కూతురు సంధ్యను చదివించా. తొలిప్రయత్నంలోనే పంచాయతీ కార్యదర్శిగా ప్రభుత్వ కొలువులో చేరింది.రాధమ్మ, డ్వాక్రా సంఘం అధ్యక్షురాలు, బెల్కటూరు.

**అన్నిరంగాల్లో ప్రోత్సహిస్తున్నాం..**

స్వయం సహాయక సంఘాల మహిళల ఆసక్తిని గుర్తించి రుణాలు విరివిగా అందించి ప్రోత్సహిస్తున్నాం. రుణాలతో ఏర్పాటు చేసే యూనిట్లను విజయవంతంగా నిర్వహించేందుకు సీసీలు, ఏపీఎంలతో పర్యవేక్షణ చేయిస్తున్నాం. గ్రామాల వారిగా సమీక్ష సమావేశాలు నిర్వహించి లక్ష్యంమేర రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నర్సింహులు, డీపీఎం, గ్రామీణాభివృద్ధి శాఖ.

# అమ్మో డేటింగ్ యాప్స్.. ఆకర్షణ వలలో చిక్కి యువత విలవిల

హైదరాబాద్: అందమైన రూపం.. ఆకర్షించే సంపాదన. ఒక్క క్లిక్‌తో ఆనందాన్ని ఆస్వాదించవచ్చంటూ కనికట్టు. నచ్చిన జోడును ఎంపిక చేసుకోవచ్చంటూ ఊరింపు. ఒక్కసారి చిక్కారా.. జేబులైనా ఖాళీ కావాలి.. ఒళ్లయినా హూనం చేసుకోవాలి. ఎంతోమంది డేటింగ్‌యాప్ మోసాల్లో బాధితులుగా మారుతున్నారు. గౌరవమైన వృత్తిలో ఉంటూ మాయాజాలానికి చిక్కినట్టు తెలిస్తే పరువు పోతుందనే భయంతో 90శాతం మంది ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావట్లేదంటున్నారు పోలీసులు.ఐటీ ఉద్యోగిని జీవితభాగస్వామి కోసం డేటింగ్‌యాప్‌లో వెతికింది. యువకుడి ప్రొఫైల్ నచ్చి ఒకే చెప్పింది. యూకేలో వైద్యుడినంటూ పరిచయం చేసుకొని వ్యక్తిగత అవసరాలంటూ రూ.15లక్షలు కొట్టేసి ముఖం చాటేశాడు.యాప్‌లో పరిచయమైన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ముహూర్తం కోసం ఎదురుచూస్తుండగా అప్పటికే పెళ్లయినట్టు తెలిసిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆస్ట్రేలియాలో ఉంటున్న యువకుడికి రాయచూర్‌లోని యువతి సామాజిక మాధ్యమం ద్వారా పరిచయమైంది. యువతిని హైదరాబాద్ రప్పించి, శీతలపానీయంలో మత్తుమందు కలిపి అఘాయిత్యానికి ఒడిగట్టాడు.గతంలో నైజీరియన్లు మాత్రమే పాల్పడే మోసాల్లో ప్రస్తుతం తెలుగు కుర్రాళ్లు కూడా ప్రారంభించారని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కీలుబొమ్మలతో వలపు ఎర

వ్యభిచార ముఠాల వారు దేశ, విదేశీ యువతులకు కమీషన్ ఆశచూపి డేటింగ్‌యాప్‌ల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఆయా యాప్‌ల్లో నమోదైన వారిలో సంపన్నులతో ఛాటింగ్ చేస్తారు. ఏకాంతంగా గడిపేందుకు హైదరాబాద్‌లో



హోటల్‌గది బుక్ చేయిస్తారు. సెల్‌ఫోన్‌తో వీరి రాసలీలలు చిత్రీకరించి.. బెదిరించి రూ.లక్షల్లో గుంజుతారు. ఇటీవల ప్రధానపార్టీకి చెందిన చోటా నేత రూ.3లక్షలు పోగొట్టుకున్నాడు. జూబ్లీహిల్స్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో విదేశీ యువతులు అద్దెకు దిగారు. యాప్ ద్వారా పరిచయమైన పురుషులను ఆహ్వానించేవారు. అపార్ట్‌మెంట్ కిందభాగంలో ఉన్న ఏజెంట్లు వారిని బెదిరించి నగదు లాక్కునేవారు. పోలీసుల దృష్టికి వెళ్లటంతో ముఠా ఆటకట్టించారు.

# అరుదైన నైపుణ్యం.. ఆధునికీకరిస్తే మేలు

సిరిసిల్ల: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో ఉంటారు. వీరి చేనేత కళలకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. కాలక్రమంలో చేనేత స్థానంలో మరమగ్గాలు వచ్చాయి. ఆధునికతను అందిపుచ్చుకుంటూ.. ఉత్పత్తులకు వన్నెలద్దిన నేతన్నలు తమ కంటూ ప్రత్యేకత చాటుకున్నారు. అయితే ఏడేళ్లుగా ఒకే రకమైన ఉత్పత్తులను చేయడంతో నేతన్నలకు ఆదాయం రావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆర్డర్లను సమతూకం చేసుకుంటేనే చేనేత పరిశ్రమకు మనుగడ.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

**ఉమ్మడి జిల్లాలో 36 వేల మరమగ్గాలు**

రాష్ట్ర వ్యాప్తంగా 48 వేల మరమగ్గాలుంటే.. ఉమ్మడి జిల్లాలోనే 36 వేలు ఉన్నాయి. సిరిసిల్లలో 1970లో వేళ్లూనుకున్న మరమగ్గాల పరిశ్రమ రెండో షోలాపూర్‌గా ప్రసిద్ధి చెందింది. గత భారాస ప్రభుత్వం ఇక్కడే అత్యాధునిక పరిశ్రమల కేంద్రమైన టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాలో 31 చేనేత పారిశ్రామిక సహకార సంఘాల్లో 1524 మంది కార్మికులు పనిచేస్తున్నారు. మరమగ్గాల్లో ఎనిమిది వేల మంది నేతన్నలు ఉపాధి పొందుతున్నారు. చేనేత వృత్తి ఆనవాళ్ల కోసం పాతతరం వారు మగ్గాలపైనే వస్త్రాలు నేస్తున్నారు. ముతక రకం తెల్లవస్త్రం నుంచి పట్టు చీరలను పోలిన ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. ప్రభుత్వం ఆధునికీకరణకు రాయితీలు కల్పించడంతో పురాతన మరమగ్గాలకు డాబీ, జకాట్, ఎలక్ట్రానిక్ పరికరాలను అమర్చుకున్నారు. కానీ ఆర్డర్లు లేక వీటి వినియోగం తగ్గింది. గత



భారాస ప్రభుత్వం చేనేత కార్మికులకు బతుకమ్మ చీరల తయారీ బాధ్యతలు అప్పగించడంతో వారికి చేతి నిండా పని ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం బతుకమ్మ చీరలను నిలిపివేసి పాఠశాలల ఏకరూప దుస్తులను కుట్టే బాధ్యతలు అప్పగించడంతో వారికి ఉపాధి తగ్గింది. రాష్ట్ర ప్రభుత్వం మొన్నటి బడ్జెట్‌లో చేనేత, జౌళి రంగానికి రూ.370 కోట్లు కేటాయించి ప్రభుత్వ సంస్థలకు అవసరమైన వివిధ వస్త్రాలను టెస్కో ద్వారా స్థానిక నేతన్నల నుంచే సేకరించాలని నిర్ణయించింది. ఇటీవల కేంద్రం రాష్ట్రంలో ఐఐహెచ్‌టీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ) ఏర్పాటు చేయడానికి అంగీకరించడం శుభపరిణామంగా చెపొచ్చు.

**అద్భుత కళలకు నిలయం**

చేనేత మగ్గంపై అనేక అద్భుతాలు సృష్టించిన ఘనత సిరిసిల్లా జిల్లా నేతన్నల సొంతం. ఈ వారసత్వాన్ని నేటి తరం కొనసాగిస్తున్నారు. పట్టు, సిల్కు నూలుతో తయారుచేసిన వస్త్రాలు, అగ్గిపెట్టెలో పట్టే చీర.. ఉంగరం, దబ్బణంలో దూరే వస్త్రాలు నేసి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. గతేడాది చేనేత మగ్గంపై జీ–20 లోగోను తయారుచేసిన సిరిసిల్లకు చెందిన హరిప్రసాద్ ప్రధాని మోదీ దృష్టిని ఆకర్షించాడు. అయితే ప్రభుత్వాలు నేతన్నల సంక్షేమం మీద దృష్టిపెట్టి వారికి ఆర్డర్లు అప్పగించి పని కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేతన్నల ప్రధాన డిమాండ్‌లు

మరమగ్గాల ఆధునికీకరణకు రాయితీలు

ఈ రంగంలో స్థిరపడాలనుకునే కొత్తతరం వారికి ప్రోత్సాహకాలు

ఉమ్మడి జిల్లాలో వస్త్రోత్పత్తులకు సీఎఫ్‌సీ (ఉమ్మడి వసతుల కేంద్రం)

యజమానులు, ఆసాములు తమ ఉత్పత్తులను స్వతంత్రంగా విక్రయించుకునేలా నేత బజారు ప్రభుత్వ వస్త్రోత్పత్తుల ఆర్డర్లు ఏటా 15 కోట్ల మీటర్ల అందించాలి నూలు డిపో ఏర్పాటు చేసి ప్రభుత్వమే నూలు.. పెట్టుబడి కింద మ్యాక్స్ సంఘాల సభ్యులకు రూ.10 లక్షల సాయం అందించాలి.మరమగ్గాల కార్మికుల నైపుణ్యాలను మెరుగుపరిచేలా టెస్కో ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించాలి

# లింకు రోడ్లకు సై.. శివారులో రయ్ రయ్

హైదరాబాద్: ప్రధాన నగరంలో ఏళ్లుగా ఎదురు చూస్తోన్న బేగంపేట లింకు రోడ్లకు మోక్షం లభించింది. భూసేకరణ, ఇతర సవాళ్లను దాటుకుని నెక్లెస్‌రోడ్డు రైల్వేస్టేషన్ నుంచి బేగంపేట రైల్వేస్టేషన్ వరకు రైలు మార్గం పొడవునా లింకు రోడ్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. బేగంపేట ప్రకాశ్‌నగర్ నుంచి మూసీ నది పక్కనున్న బ్రాహ్మణవాడిని కలుపుతూ మరో లింకు రోడ్డు నిర్మాణం కాబోతుంది. నెక్లెస్ రోడ్డు జలవిహార్ నుంచి రైల్వే లైను మీదుగా బేగంపేటను కలిపే ఆర్వోబీ ప్రతిపాదన పరిశీలనలో ఉంది. దీనికి సైతం ఆమోదం లభిస్తుందని బల్దియా ఆశాభావం వ్యక్తం చేస్తోంది. వీటితోపాటు శివారులోని పలు ప్రాంతాల్లో కలిపి 49 లింకు రోడ్లకు ప్యాకేజీ 1, 2 లలో భాగంగా హైదరాబాద్ రహదారుల అభివృద్ధి సంస్థ(హెచ్ఆర్‌డీసీఎల్) టెండర్లు పిలిచింది. ప్యాకేజీ–1లోని 24 రోడ్లను రూ.486 కోట్లతో, ప్యాకేజీ–2లోని 25 రోడ్లను రూ.571.4 కోట్ల నిధులతో 100 అడుగుల వెడల్పున నిర్మించనున్నారు. రెండేళ్లలో పనులు పూర్తవుతాయని ఇంజినీర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# దడ పుట్టిస్తున్న భూస్థాయి ఓజోన్

హైదరాబాద్: వాహనాలు, పరిశ్రమల వల్ల వెలువడే భూస్థాయి ఓజోన్ (గ్రౌండ్ లెవెల్ ఓజోన్) పరిమాణం ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తోంది. ఐదేళ్లలో నమోదైన వివరాలతో పోల్చితే ఈ ఏడాది మరింతగా



పెరిగిందని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) తాజా అధ్యయనంలో వెల్లడించింది. జనవరి నుంచి జూన్ మధ్య నిత్యం ఒక ప్రాంతంలో భూస్థాయి ఓజోన్ పరిమాణం పెరిగిందని వెల్లడించింది. అయితే గతంతో పోల్చితే గ్రేటర్‌లో భూస్థాయి ఓజోన్ పరిమాణం పెరిగిందని తెలిపింది. సాధారణంగా ఓజోన్ పొర భూమికి 15–30 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడి అతి నీల లోహిత కిరణాల నుంచి భూమిని కాపాడుతుంది. అయితే వాహనాల నుంచి వెలువడే భూస్థాయి ఓజోన్ భూఆవరణలోనే ఉంటుంది. ఇది మానవాళికి హానికరం. గ్రేటర్ హైదరాబాద్‌లో యావరేజ్ డ్యూరేషన్ ఆఫ్ ఎక్సీడెన్స్ (వ్యాప్తి సమయం) గతేడాది 11.7 గంటలు ఉండగా ఈ ఏడాది 12.7 గంటలకు పెరిగిందని వెల్లడించింది.

# ముందు ఉదాసీనం.. తర్వాత క్రియాశీలం

ఆసిఫాబాద్: రెండేళ్ల కిందట ఈ ప్రాంతమంతా అడవే. ప్రస్తుతం పూర్తిగా పంట చేలుగా మారింది. లింగాపూర్, తిర్యాణి మండలాల్లో ఈ విధంగా యథేచ్ఛగా అడవుల నరికివేత, పోడు సాగు భారీగా సాగుతోంది. పచ్చని వన సంపద మైదానంలా మారుతోంది. రెండు, మూడు సంవత్సరాల క్రితం ఉన్న దట్టమైన అడవులు పంట పొలాలుగా మారుతున్నాయి. నరికే సమయంలో ఉదాసీనంగా ఉన్న అటవీ అధికారులు సాగు చేసుకునే సమయంలో ఉరుములేని పిడుగులా విరుచుకుపడి పంట భూములను స్వాధీనం చేసుకుంటామని హడావుడి చేయడం జిల్లాలో పరిపాటిగా మారింది. పోడు సాగు చేసుకునే రైతుల భూముల నుంచి తప్పకుండా కొంత భాగం తీసుకోవాలని ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో.. వీరంతా తలలు పట్టుకుంటున్నారు. విత్తనాలు వేస్తున్న రైతుల వద్దకు వెళ్లి భూమి తిరిగి ఇవ్వాలని కోరడంతో.. జిల్లా వ్యాప్తంగా ఏదో ఓ చోట ఆందోళనలు జరుగుతున్నాయి.

జిల్లాలోని లక్ష ఎకరాల్లో పోడు సాగుతుందని అంచనా. మొదట గిరిజనులు సాగు చేసినా, వివిధ కారణాలతో వారి భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. అనంతరం వీరు అడవిని నాశనం చేస్తూ



పోడును విస్తరిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఆదివాసీలనే ముందుంచి వనాన్ని నరికేసి బడా బాబులు సాగుకు ఉపక్రమిస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు కాసుల యావతో ఇబ్బడిముబ్బడిగా పట్టాలు అందించారు. దీంతో పట్టాలున్న భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదాలు కొలిక్కిరాక పోవడం, అటవీ భూములకు పట్టాలు జారీ కావడంతో ఏటా ఈ వ్యవహారం జటిలంగా మారుతోంది. జిల్లాలో 11 రేంజ్‌లు ఉండగా, ఒక్కో దాని నుంచి 150 ఎకరాల చొప్పున మొత్తం 12,650 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని డీఎఫ్‌ఓ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందరికీ పట్టాలు...

కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్ సర్వే నం.145లో 600 ఎకరాల భూమి ఉంది. రైతులకు 199 ఎకరాల్లో మాత్రమే రెవెన్యూ భూమి ఉందని అటవీ అధికారులు చెబుతున్నారు. దాదాపు నాలుగు వందల ఎకరాల అటవీ భూమి పూర్తిగా పొలాలుగా ఉన్నాయి. వీటికి పట్టాలున్నాయి. ఈ ప్రాంతంలో పులి కదలికలు ఉన్నాయి. ఇటీవల అధికారులు భూమిని తీసుకుందామని వెళ్లేసరికి రైతులతో వాగ్వాదం జరిగింది. పట్టా పాస్ పుస్తకాలతో రైతులు ఆందోళనకు దిగారు.

అన్ని మండలాల్లోనూ...

ఇటిక్యాలపహాడ్ మాదిరిగానే ఆసిఫాబాద్ మండలం దానాపూర్‌లో సైతం రైతులతో అటవీ అధికారులకు నిత్యం వాగ్వాదం జరుగుతోంది. భూములన్నింటినీ తిరిగి ఇచ్చేయాలని అధికారులు చెప్పడంతో.. గ్రామస్థులు ఆందోళన చేస్తున్నారు. పెంచికల్‌పేట్, బెజ్జూర్, చింతల మానేపల్లి, రెబ్బెన మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఇదే సమస్య ఉంది.ఇరువైపుల వాదనలు.. మహారాష్ట్రలోని తడోబా అభయారణ్యాల నుంచి పులులు ఎక్కువగా సిర్పూర్(టి) మండలం ఇటిక్యాలపహాడ్ గ్రామం నుంచి కాగజ్‌నగర్ అడవుల్లోకి ప్రవేశిస్తాయి. ఇక్కడి రైతులు దాదాపు 800 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మొదట 550 ఎకరాల వరకు భూములను తీసుకుంటామని చెప్పిన అధికారులు ప్రస్తుతం మొత్తం ఇవ్వాలని పట్టుపడుతున్నారు. ఈ విషయమై అధికారులు నిత్యం గ్రామస్థులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. భూములు ఇస్తే జీవనాధారం కోల్పోతామని వాపోతున్నారు. కుమురం భీం ప్రాజెక్టు పునరావాసంలో భాగంగా ఇక్కడ గ్రామస్థులను పునరావాసం కల్పించామని, అక్కడే భూములు కోల్పోయిన వారికి పరిహారం అందజేశామని, ఈ రైతులు తా గిరిజనేతరులే అని అటవీ భూములపై వీరికి హక్కులు కల్పించలేదని మని అధికారులు పేర్కొంటున్నారు.

ప్లాంటేషన్ కోసం తీసుకుంటున్నాం నిరజ్‌కుమార్, డీఎఫ్‌ఓరెవెన్యూ భూముల పట్టాలు కలిగి ఉండి, అదనంగా పోడు సాగు చేసుకుంటున్న వారి భూములను తీసుకోవాలని పై నుంచి ఆదేశాలున్నాయి. ఒకవేళ పరిహారం తీసుకుని భూములు కోల్పోయిన వారు మరోచోట ఇష్టానుసారంగా చెట్లను నరికేస్తూ పోడు చేసుకుంటున్నారు. ఇటువంటి వాటినే స్వాధీనం చేసుకుని మొక్కలు నాటుతాం.

# దూరభారం తప్పేలా.. సత్వర న్యాయం అందేలా

మందమర్రి : ప్రజలకు న్యాయం చేరువలో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మందమర్రిలో నూతనంగా న్యాయస్థానం ఏర్పాటు చేయనుంది. దీంతో రెండు మండలాల నుంచి మంచిర్యాల, బెల్లంపల్లి న్యాయస్థానానికి హాజరవుతున్న కక్షిదారులకు దూరం భారంతో పాటు ఆర్థిక భారం తప్పనుంది. అంతేకాకుండా త్వరితగతిన కేసులు పరిష్కారం కావడం వంటి ఉపశమనం లభించనుంది. జూలై చివరి నాటికి సేవలు ప్రారంభం కానున్నట్లు సమాచారం.

పదేళ్ల నిరీక్షణకు తెరమందమర్రిలో న్యాయస్థానం ఏర్పాటు చేయాలనే ప్రక్రియ పదేళ్లుగా కొనసాగుతోంది. ఈ క్రమంలో అప్పటి జిల్లా న్యాయమూర్తి సైతం ఇక్కడ పలు సింగరేణి భవనాలను పరిశీలించారు. ప్రస్తుతం న్యాయస్థానం ఏర్పాటు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయడంతో మరోసారి తెరపైకి వచ్చింది. ఈ క్రమంలోనే సింగరేణి ఆధ్వర్యంలో ఉన్న సీఐఎస్ఎఫ్ శిబిర భవనంతో పాటు కమ్యూనిటీ హాల్, సీఈఆర్‌క్లబ్ భవనాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు పరిశీలించారు. జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం ఏర్పాటుకు సీఐఎస్ఎఫ్ శిబిర భవనం అనుకూలంగా ఉందని నిర్ణయానికి వచ్చారు. భవనం ఇచ్చేందుకు సింగరేణి సుముఖత చూపడంతో త్వరలోనే న్యాయస్థానం ఏర్పాటు కానుంది.

విచారణ దశలో మూడు వేల కేసులు మందమర్రి సర్కిల్ పరిధిలోని నాలుగు పోలీస్‌స్టేషన్లలో నమోదవుతున్న కేసులకు సంబంధించి కక్షిదారులు మంచిర్యాల, బెల్లంపల్లి న్యాయస్థానాల్లో జరుగుతున్న విచారణకు హాజరవుతున్నారు. ఇక్కడి న్యాయస్థానం ఏర్పాటుతో రెండు మండలాల్లోని ప్రజలకు, కక్షిదారులకు ఆర్థికంగా, రవాణా భారం తగ్గి సమయం ఆదా అవుతుంది. ప్రస్తుతం నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మూడు వేల కేసులు న్యాయస్థానాల్లో విచారణ దశలో ఉన్నట్లు సమాచారం.

# డీడీఎన్ఎస్‌కు ఎదురుచూపులు



జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో దేవాదాయశాఖ పరిధిలో కరీంనగర్‌లో 246, జగిత్యాలలో 203, రాజన్న సిరిసిల్లలో 254, పెద్దపల్లిలో 166 దేవాలయాలు ఉన్నాయి. వీటికి అదనంగా దూప, దీప నైవేద్యాల పథకం(డీడీఎన్ఎస్) కింద మరో 898 దేవాలయాల్లో అర్చనలు కొనసాగుతున్నాయి. పలు కారణాలతో చాలా దేవాలయాలు ఈ పథకానికి దూరంగా ఉన్నాయి. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో మరోసారి ఎంపిక ప్రక్రియ చేపట్టాలని ఆశిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా పరిస్థితిపై కథనం..

దూప, దీప నైవేద్యం పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు నిర్దేశించింది. ఆలయం విధిగా దేవాదాయశాఖ చట్టం 43 ప్రకారం ఆమోదం పొందాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే ముందే దేవాదాయశాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ మేరకు మొదట్లో గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలకు మాత్రం అవకాశం ఉండగా ప్రజాప్రతినిధుల చొరవతో నగర, పట్టణ ప్రాంతాల్లో ఆలయాలను సైతం ఎంపిక చేసేందుకు వెసులుబాటు లభించింది. అయితే దరఖాస్తు చేసిన సంబంధిత ఆలయానికి ఎలాంటి ఆదాయ వనరులు ఉండరాదు. ఒక వేళ భూమి ఉన్నప్పటికీ 5 ఎకరాలకు మించరాదు. పథకం ప్రారంభించిన మొదట్లో అర్చకులకు నెలకు గౌరవ వేతనం కింద రూ.2 వేలు ఆ తరువాత రూ.6 వేలు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక రూ.10 వేలు అందిస్తున్నారు.

సిబ్బంది కొరత.. పర్యవేక్షణ లోపం

డీడీఎన్ఎస్ పథకం కింద ఎంపికైన కొన్ని ఆలయాల్లో అర్చనలు సజావుగా జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. దేవాదాయశాఖలో సిబ్బంది కొరత కారణంగా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ సాధ్యం కావడం లేదు. కేవలం రెండు పూటలా పూజలు నిర్వహించి విధులు ముగించుకొనే అవకాశం ఉండగా.. ఆ తరువాత సైతం ఆలయాల్లో అధిక సమయం వెచ్చించాలని కోరడంతో ఇబ్బందులు తప్పడం లేదని పలువురు అర్చకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డీడీఎన్ఎస్ కింద 2023లో రాష్ట్రవ్యాప్తంగా 475 దేవాలయాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇదే విధంగా ఉమ్మడి జిల్లాలో నిబంధనల ప్రకారం అర్హత సాధించని ఆలయాలు ఉన్నాయి. దీనికి గతంలో ఎంపికైన మరికొన్ని ఆలయాలు సైతం వివిధ కారణాలతో అర్చనలు నిలిచిపోయాయని ఆరోపణలు ఉన్నాయి. దీంతో పలు చిన్నా పెద్ద ఆలయాలు నిత్యం ఆర్చనకు నోచుకోకపోగా ఉపాధి లేని పేద అర్చకులకు నిరీక్షణ తప్పడం లేదు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో మరోసారి ఎంపిక ప్రక్రియ చేపట్టాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు– చంద్రశేఖర్, సహాయక కమిషనర్

దూప, దీప నైవేద్యం పథకం నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తే ఆలయాల నిర్వహణ మరికొంత మెరుగు పడే అవకాశం ఉంది. ఆలయాల ఎంపిక విషయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

# హరితానికి సిద్ధం.. సంరక్షణతోనే ఫలితం




పెద్దపల్లి : జిల్లాలో హరితహారం కింద పెంచడానికి మొక్కలను సిద్ధం చేసే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. ఈ ఏడాది 16.64 లక్షల మొక్కలు పెంచాలని నిర్ణయించారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలతో పాటు సింగరేణి, ఎన్టీపీసీ, కేశోరామ్ పరిశ్రమలకు లక్ష్యాలు కేటాయించారు. అయితే ఏటా మొక్కలు నాటడంలో ఉత్సాహం చూపుతుండగా సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా లక్షల మొక్కలు ఎండిపోతుండగా రూ.కోట్ల నిధులు దుర్వినియోగమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నాటిన ప్రతి మొక్కనూ బతికించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. గ్రామీణ, పురపాలికల్లో వేర్వేరు నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వచ్చే నెల మొదటి వారంలో మొక్కలు నాటాలని భావిస్తున్నారు.

నీడనిచ్చే, పూల మొక్కలకు ప్రాధాన్యం

జిల్లాలో నాటడానికి మొక్కల కొరత లేకుండా ఊరికో నర్సరీ ఏర్పాటు చేశారు. వాటిలో టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, కర్జూర, మందార, సన్నజాజి, మల్లె తదితర రకాల విత్తనాలతో పాటు ప్రకృతిలో లభించే వాటికి ప్రాధాన్యమిచ్చారు. ప్రతి నర్సరీకి కంచె(ఫెన్సింగ్) ఏర్పాటు చేశారు. వేసవిలో నీటిని సమకూర్చేందుకు బోర్లు లేని చోట్ల ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. గత అనుభవాల దృష్ట్యా విత్తన దశ నుంచే నర్సరీలపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచారు. తరచూ సమీక్షలు నిర్వహిస్తూ లోపాలను సరిదిద్దడంతో గతంతో పోలిస్తే ఈసారి నర్సరీల్లో మొక్కల ఎదుగుదల కొంత మెరుగ్గా ఉంది.

గ్రామీణాభివృద్ధి శాఖకే అధిక లక్ష్యం

జిల్లాలో ఈ ఏడాది 16.64 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకోగా ఇందులో ప్రధానంగా గ్రామీణాభివృద్ధి శాఖకు 8 లక్షలు, అటవీ శాఖకు 60 వేలు, రామగుండం నగరపాలకసంస్థకు 80 వేలు, పురపాలక సంఘాల్లో పెద్దపల్లికి 50 వేలు, సుల్తానాబాద్‌కు 30 వేలు, మంథనికి 30 వేలు, సింగరేణి 5 లక్షలు, ఆర్ఎఫ్‌సీఎల్ 10 వేలు, ఎన్టీపీసీ 20 వేలు, కేశోరామ్ 5 వేలు, మిగతా లక్ష్యాన్ని మరో 28 శాఖలకు విధించారు. కూలీలతో గుంతల తవ్వకం పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నాటిన ప్రతి మొక్కకూ ముళ్ల కంచెతో పాటు విధిగా నీటి తడులు అందించేలా ఆయా శాఖలు బాధ్యత తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. హరితహారం కింద వెచ్చిస్తున్న రూ.కోట్ల ప్రజాధనం వృథా కాకుండా దిద్దుబాటు చర్యలు చేపడితే ప్రయోజనం కలుగుతుంది.

ప్రభుత్వ అనుమతి రాగానే నాటుతాం

–శివయ్య, అటవీ శాఖ జిల్లా అధికారి

జిల్లాలో నర్సరీల్లో పెంచుతున్న మొక్కల ఎదుగుదల బాగానే ఉంది. లక్ష్యాలకు సరిపడా అందుబాటులో ఉన్నాయి. మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఆదేశించాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేశాం.

# నిధులిస్తేనే.. సాంకేతిక విద్యాభివృద్ధి

సిరిసిల్ల : జేఎన్‌టీయూలోని విద్యార్థులకు అనుగుణంగా తరగతి గదులు, వసతి గృహాలను సమకూర్చడం ఏటా సవాలుగా మారుతోంది. గతేడాది కళాశాల భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించారు. వాటికి నిధుల కేటాయింపులో జాప్యం కారణంగా పనులు ముందుకు సాగడంలేదు. జిల్లాకు 2021-22 విద్యాసంవత్సరంలో జేఎన్‌టీయూ కళాశాల మంజూరైంది. తాత్కాలికంగా అగ్రహారంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంలోని కొంత భాగంలో ఇంజినీరింగ్ తరగతులు జరుగుతున్నాయి. సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్, టెక్స్‌టైల్ విభాగాల్లో మూడేళ్లలో కలిపి 780 మంది విద్యార్థులున్నారు. వీరిలో 600 మంది వసతి గృహాల్లో ఉంటున్నారు. ఈ ఏడాది ప్రవేశాలకు ఈసెట్ వెబ్ ఆప్షన్లు గురువారం నుంచి మొదలవుతాయి. ఎంసెట్ ర్యాంకుల వారీగా ఈ నెలాఖరులో వెబ్ ఆప్షన్లు ఇచ్చే అవకాశం ఉంది. దాని తర్వాత కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. నాలుగో సంవత్సరం విద్యార్థులకు అదనపు తరగతి గదులతోపాటు కొత్తగా చేరేవారికి వసతి గృహాలకు ఇప్పటి నుంచే అన్వేషణ ప్రారంభించారు.

బోధన.. భోజనం అక్కడే

కొత్త విద్యాసంవత్సరంలోకి అడుగు పెట్టేసరికి ప్రస్తుతం ఉన్న తరగతి గదులు సరిపోవడంలేదు. మౌలిక వసతుల కల్పనలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. నాలుగేళ్లుగా విశ్వవిద్యాలయం గ్రాంట్ నుంచి విడతల వారీగా డిగ్రీ కళాశాలలోనే అదనపు గదులు, కంప్యూటర్ ల్యాబ్, వంటగది, భోజనశాలకు ఫ్యాబ్రికెట్ షెడ్‌లను ఏర్పాటు చేసుకున్నారు. అగ్రహారం, చిర్లవంచ ఆర్అండ్ఆర్ కాలనీలోని ఎనిమిది ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకుని బాల, బాలికలకు వేర్వేరు వసతి గృహాలను సమకూర్చారు. ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయితే మరో 150 ప్రవేశాలకు అవకాశం ఉంది. అదనంగా నాలుగు తరగతి గదులు అవసరం. మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, కంప్యూటర్ విభాగాలకు ల్యాబ్స్ కోసం కొండగట్టు జేఎన్‌టీయూకి పంపుతున్నారు. మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన 14 మంది టెక్స్‌టైల్ విద్యార్థులు ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాలలో తరగతులు ఇప్పిస్తున్నారు. నాలుగో సంవత్సరం కూడా అక్కడే తరగతులు నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నారు.

పనుల ప్రారంభానికి జాప్యం

తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో జేఎన్‌టీయూ కళాశాల భవన నిర్మాణానికి 20 ఎకరాల స్థలాన్ని గతేడాది ఆగస్టులో రెవెన్యూ శాఖ రిజిస్ట్రార్‌కు అందించింది. అంతకుముందు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ నిర్మాణ విభాగం అధికారులు, రెవెన్యూ శాఖ సంయుక్తంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. కళాశాల నిర్మాణానికి తొలుత సిరిసిల్ల–కామారెడ్డి బాహ్యవలయ రహదారి సమీపంలోని పెద్దూరు వద్ద 50 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. కేటాయింపులు జరిగేలోపు ఆ స్థలాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించారు. చివరికి మండేపల్లిలోని స్థలాన్ని ఖరారు చేసి ఇచ్చారు.నివేదికలు అందజేశాం– వేణుగోపాల్, ప్రిన్సిపల్, జేఎన్‌టీయూ సిరిసిల్ల విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా మౌలిక వసతులు సమకూర్చడం, కళాశాలలో నెలకొన్న పరిస్థితులపై ఇటీవలే జేఎన్‌టీయూ ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం. తాత్కాలిక అవసరాలకు సైతం నిధులు అవసరం ఉంది. ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యేలోపు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు సమకూర్చుతాం.

# అప్రకటిత కోత.. వినియోగదారుల వెత

మంచిర్యాల : మెరుగైన సేవలు, నాణ్యమైన విద్యుత్తును అంతరాయం లేకుండా అందిస్తామంటూ జిల్లా విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారే తప్పితే అమలు అంతంత మాత్రంగానే ఉంది. తీగలు సరిచేయడం, నూతన నియంత్రికలు, స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామంటున్నారు. ఉపకేంద్రాల సామర్థ్యాన్ని పెంచుతున్నామంటున్నారు. కానీ వీటి ఫలితం తెలియకుండా ఉంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోనే నిత్యం అంతరాయం ఏర్పడుతున్నట్లు అనేకమంది నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఇటీవల నూతనంగా చేపట్టిన విద్యుత్తు ప్రజావాణిలోనూ జిల్లా వ్యాప్తంగా 20రాగా సెక్షన్–3లోనే అత్యధికంగా ఏడు వచ్చాయి.

సమయానికి ఇచ్చిన సందర్భమే లేదు..

ప్రతివారం మరమ్మతులు అంటూ సరఫరా నిలిపివేస్తున్నారు. ఓ సమయాన్ని ముందస్తుగా ప్రకటిస్తున్నారు. కానీ వారు సూచించిన సమయానికి సరిగ్గా ఇప్పటి వరకు ఏ రోజు కూడా పునరుద్ధరించింది లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఇటీవల ఉపకేంద్రంలో సామర్థ్యాన్ని పెంచుతున్నామంటూ పదిగంటలపాటు అంతరాయం ఉంటుందని అధికారులు ముందుగా ప్రకటించారు. దీనికి అదనంగా మరో అయిదు గంటలు తీసుకున్నారు. దీంతో పట్టణం–2లో ఆ రోజంతా సరఫరా లేకుండా చేశారు. ఇదే ప్రాంతంలో మంగళవారం ఎలాంటి సమాచారం లేకుండా నాలుగు గంటలకు పైగా అంతరాయం ఏర్పడింది. ఇటీవల రాజీవ్‌నగర్ ఉపకేంద్రం సామర్థ్యాన్ని పెంచేందుకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తుండగా తీసిన చిత్రమిది. రూ.80 లక్షల వ్యయంతో పట్టణం–2 పరిధిలో హెచ్చుతగ్గులు, విద్యుత అంతరాయాన్ని నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అయినా ఇంకా ఆ ప్రాంతాల్లో సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి.



ఎన్నడూ లేనంతగా అంతరాయం

దండనాయకుల ప్రకాష్‌రావు, సున్నంబట్టివాడ

గత మూడునెలలుగా ఎన్నడూ లేనంతగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం చూస్తున్నా. జిల్లా కేంద్రంలోని పట్టణం–2గా పిలిచే సెక్షన్–3లో ఉన్న సున్నంబట్టివాడతోపాటు హమాలీవాడ, అశోక్‌రోడ్, గోపాల్‌వాడ, రాజీవ్‌నగర్, తిలక్‌నగర్, సూర్యనగర్‌లో నిత్యం సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఒక్కోసారి గంటల తరబడి కరెంటుపోతున్నా నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఏ అధికారిని ప్రశ్నించినా ఏదో ఒక సమాధానం చెబుతున్నారు గానీ అంతరాయం తగ్గించేందుకు ప్రయత్నించడం లేదు.

నిర్మాణం, ఇతర ఏ రకమైన విద్యుత్తు సంబంధిత పనులు చేపట్టాలన్నా ఇబ్బందిగా మారిందని అశోక్‌రోడ్‌కు చెందిన ఓ వ్యక్తి 'న్యూస్‌టుడే'తో ఆవేదన వ్యక్తం చేశారు. స్లాబ్ దగ్గరనుంచి లోపల నిర్వహించే అనేక పనులకు విద్యుత్తు తప్పనిసరి. ఆ పనులు చేపట్టేందుకు నిపుణులను పిలిచినరోజు అకస్మాత్తుగా అంతరాయం ఏర్పడుతోంది. గంటలకొద్ది నిలిపివేయడంతో పనులకు ఆటంకం కలుగుతోంది. ఆ రోజు కూలీ డబ్బులు సైతం వారికి చెల్లిస్తున్నాం. తరచూ ఏర్పడుతున్న అంతరాయాన్ని నివారించేందుకు విద్యుత్తుశాఖ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.సమస్యలు గుర్తించి చర్యలు చేపడుతున్నాం

శ్రావణ్‌కుమార్, ఎస్ఈ, మంచిర్యాల

జిల్లా కేంద్రంతో పాటు అంతరాయం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సమస్యలు గుర్తించి చర్యలు చేపడుతున్నాం. మరమ్మతుల్లో భాగంగా సరఫరా నిలిపివేయాల్సి వస్తోంది. సెక్షన్–3, రామకృష్ణాపూర్‌లో ఇబ్బంది ఎక్కువగా ఉందని ఇప్పటికే తెలుసుకున్నాం. అందుకు తగ్గట్లుగా సమస్య పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నాం. త్వరలోనే సమస్యలన్నీ తొలగించి నిరంతరాయంగా విద్యుత్తు అందిస్తాం.

# నిలిచిన ప్రసవ శస్త్రచికిత్సలు

ఇల్లెందు : ఇల్లెందు సీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవ శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. వైద్యురాలు ప్రసూతి సెలవుపై వెళ్లడంతో నెల రోజుల నుంచి ఆపరేషన్లు ఆగిపోయాయి. కేవలం సాధారణ ప్రసవాలకే వైద్యశాల పరిమితమైంది. ఇల్లెందు పట్టణ, మండలంతో పాటు టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి, కారేపల్లి మండలాల్లో ఏజెన్సీ గ్రామాల నుంచి కాన్పులు, వైద్య పరీక్షల కోసం నిత్యం 50 మంది గర్భిణులు వైద్యశాలకు వస్తుంటారు. గతంలో సీహెచ్‌సీలో గైనకాలజిస్టు లేకపోవడంతో ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించేవారు. కాన్పు కోసం రూ.30వేల నుంచి రూ.50వేలు ఖర్చయ్యేది. ఏడాదిన్నర క్రితం ప్రసూతి వైద్యురాలి నియామకంతో ఇబ్బందులు తొలగాయి. కానీ నెల రోజుల నుంచి గైనకాలజిస్టు లేకపోవడంతో సుమారు 30 మంది గర్భిణులను ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల వైద్యశాలలకు రిఫర్ చేశారు. 50 కిలోమీటర్ల దూరంలోని జిల్లా వైద్యశాలలకు వెళ్లలేనివారు, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం వైద్య పరీక్షలు జరగడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.'ప్రసవ వైద్యురాలు మెటర్నటీ సెలవుపై వెళ్లారు. ఆమె వచ్చే వరకు వేరే వైద్యులను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.'

హర్షవర్ధన్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్




# వైకాపాకు మరో షాక్.. ఆళ్ల నాని గుడ్‌బై

ఏలూరు : వైకాపాకు మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి మాజీ డిప్యూటీ సీఎం, ఏలూరు జిల్లాకు చెందిన ముఖ్యనేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) రాజీనామా చేశారు. ఏలూరు జిల్లా అధ్యక్ష పదవితో పాటు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆళ్ల నాని పేర్కొన్నారు. ఈ మేరకు రాజీనామా లేఖను వైకాపా అధ్యక్షుడు జగన్‌కు పంపించారు. ఇటీవలే పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కూడా వైకాపాను వీడిన సంగతి తెలిసిందే.

# స్వాతంత్ర్య వేడుకలు.. ఏపీలో జిల్లాల వారీగా పాల్గొనే మంత్రుల వివరాలివీ..

అమరావతి: రాష్ట్ర, జిల్లా స్థాయిలో స్వాతంత్ర్య వేడుకల నిర్వహణపై ఏపీ సాధారణ పరిపాలన శాఖ ప్రొటోకాల్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయిలో నిర్వహించే వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఉదయం 9 గంటలకు సీఎం ఆవిష్కరిస్తారని, జిల్లా స్థాయిలో మంత్రులు పతాకావిష్కరణ చేస్తారని తెలిపింది. ఈ మేరకు వేడుకల్లో పాల్గొనే మంత్రులు వివరాలను వెల్లడించింది. కాకినాడలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జాతీయ జెండాను ఎగురవేస్తారని, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలెక్టర్ దినేశ్‌కుమార్ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపింది. **జిల్లాల్లో పాల్గొనే మంత్రుల వివరాలు..** శ్రీకాకుళం– అచ్చెన్నాయుడు, విజయనగరం– కొండపల్లి శ్రీనివాస్, పార్వతీపురం మన్యం– గుమ్మిడి సంధ్యారాణి, విశాఖపట్నం– అనగాని సత్యప్రసాద్, అనకాపల్లి– వంగలపూడి అనిత, తూర్పుగోదావరి– కందుల దుర్గేశ్, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ– వాసంశెట్టి సుభాష్, పశ్చిమగోదావరి– నిమ్మల రామానాయుడు, ఏలూరు– కొలుసు పార్థసారథి, కృష్ణా– కొల్లు రవీంద్ర, గుంటూరు– నారా లోకేశ్, పల్నాడు– నాదెండ్ల మనోహర్, బాపట్ల– గొట్టిపాటి రవికుమార్, ప్రకాశం– డోలా బాలవీరాంజనేయస్వామి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు– పి. నారాయణ, చిత్తూరు– సత్యకుమార్, కడప– ఎన్ఎండీ ఫరూక్. అన్నమయ్య– మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, తిరుపతి– ఆనం రామనారాయణరెడ్డి, నంద్యాల– బీసీ జనార్దన్‌రెడ్డి, కర్నూలు– టీజీ భరత్, అనంతపురం– పయ్యావుల కేశవ్, శ్రీ సత్యసాయి– సవిత

# గిరిజనుల అభివృద్ధి కోసమే ఎన్టీఆర్ ఐటీడీఏను స్థాపించారు..



అమరావతి, ఆగస్టు 9: గిరిజనుల అభివృద్ధికి, పురోగతి సాధించాలన్న సంకల్పంతో ఐటీడీఏని ఎన్టీఆర్ స్థాపించారని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఐటీడీఏ వచ్చిన తర్వాత గిరిజన సోదరులు, మహిళలు ఎలా ఉండాలి అనేది తెలిసిందన్నారు. సజ్జలు, జొన్నలు, రాగులు లాంటి చిరుధాన్యాలు మాత్రమే భోజనం చేసే గిరిజనులకు రెండు రూపాయల కిలో బియ్యం ఇచ్చి వరి భోజనం పరిచయం చేసింది నందమూరి తారక రామారావు అని గుర్తుచేశారు. గడిచిన ఐదేళ్లలో అన్ని వ్యవస్థల్ని జగన్ మోహన్ రెడ్డి నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న 30 లక్షల మంది గిరిజనులు అందరు కూడా ఏదో విధంగా గడిచిన ఐదేళ్లలో ఇబ్బంది పడ్డారన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఇచ్చిన లక్ష పాతికవేల ఎకరాలు ఇచ్చారన్నారు. గడిచిన ఐదేళ్లలో దళారులతో గిరిజనులకు ఇచ్చిన భూముల్లో వైసీపీ నాయకులు గంజాయిని పండించారన్నారు. గిరిజన పిల్లలను ప్రేరేపించి గంజాయి రవాణాకు వైసీపీ నాయకులు వాడుకున్నారన్నారు. 70 శాతం మంది గిరిజన పిల్లలు జైల్లో మగ్గిపోతున్నారన్నారు. గంజాయి సూత్రధారులు మాత్రం బయటే ఉన్నారని మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. కాగా.. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ఆదివాసి దినోత్సవ వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. గిరిజన సంప్రదాయ నృత్యాల్లో కళాకారులతో పాటు చంద్రబాబు సైతం పాల్గొన్నారు. కళాకారుల డప్పు తీసుకుని స్వయంగా డప్పు వాయించారు. గిరిజన లంబాడి కళాకారులతో సరదాగా కాసేపు ముచ్చటించారు. గిరిజన సంప్రదాయమైన కొమ్ము కోయ ధరించి కళాకారులతో చంద్రబాబు జత కలిశారు. గిరిజనలు ప్రదర్శించిన ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు తయారు చేసిన కాఫీని సేవించారు. ఆ తరువాత ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వసంత కృష్ణ ప్రసాద్ పక్కనున్న అధికారులను పిలిచి మరీ వారితో కాఫీ తాగించారు.

# దిల్లీ మద్యం కేసు.. మనీశ్ సిసోదియాకు బెయిల్ మంజూరు



దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన దిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ నేత మనీశ్ సిసోదియాకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయన బెయిల్ మంజూరు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. రూ.10లక్షల వ్యక్తిగత పూచీకత్తు, ఆ మొత్తానికి ఇద్దరు షూరిటీలతో ఆయనను విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా కొన్ని షరతులు విధించింది. సిసోదియా తన పాస్‌పోర్ట్‌ను అప్పగించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని ఆదేశించింది. దిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో గతేడాది ఫిబ్రవరి 26న సీబీఐ అధికారులు అప్పటి ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మనీశ్ సిసోదియాను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఈడీ కూడా కస్టడీలోకి తీసుకుంది. అరెస్టయిన రెండు రోజుల తర్వాత మంత్రి పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి గత 17 నెలలకు పైగా ఆయన జైల్లోనే ఉన్నారు. ఈ క్రమంలో బెయిల్ కోరుతూ ఆ మధ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ బి.ఆర్ గవాయ్, జస్టిస్ కె.వి. విశ్వనాథన్ ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ఏ నిందితుడిని కాలపరిమితి లేకుండా జైలులో ఉంచలేరు. కేసు విచారణలో పురోగతి లేకపోయినా.. ఒక పరిమితి దాటిన తర్వాత ఆ వ్యక్తిని జైల్లో ఉంచడం సరికాదు. అలాకాదంటే ఆ వ్యక్తి హక్కులను హరించడమే అవుతుంది. బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవడం, ఉపశమనం పొందడం వారి హక్కు. 'బెయిల్ అనేది నియమం.. జైలు మినహాయింపు' అనే విషయాన్ని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**నియంతృత్వానికి ఈ తీర్పు చెంపదెబ్బ: ఆప్ –** సిసోదియాకు బెయిల్ మంజూరవడంపై ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు హర్షం వ్యక్తంచేశారు. "ఈ రోజు దేశమంతా ఆనందంగా ఉంది. గత 530 రోజులుగా సిసోదియాను జైల్లో పెట్టారు. పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే ఆయన చేసిన నేరమా?" అని ఎంపీ రాఘవ్ చద్దా కేంద్రంపై మండిపడ్డారు. "సిసోదియా జీవితంలో 17 నెలలు జైల్లోనే నాశనమయ్యాయి. ఈ రోజు నిజం గెలిచింది. ఈ తీర్పు నియంతృత్వానికి చెంపదెబ్బ. సీఎం అరవింద్ కేజ్రీవాల్, సత్యేందర్ జైన్‌కు కూడా త్వరలోనే న్యాయం జరిగి జైలు నుంచి విడుదలవుతారని ఆశిస్తున్నాం" అని మరో ఎంపీ సంజయ్‌సింగ్ ధీమా వ్యక్తంచేశారు.

# పేరు వివాదం.. జయా బచ్చన్‌కు మద్దతుగా సోనియాగాంధీ వాకౌట్



దిల్లీ: రాజ్యసభ ఎంపీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకురాలు జయా బచ్చన్‌కు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ మద్దతుగా నిలిచారు. మరోసారి జయా బచ్చన్ పేరును జయా అమితాబ్ బచ్చన్‌గా రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సంబోధించడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనిపై దన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ.."నాకు పాఠాలు చెప్పొద్దు" అని తీవ్రంగా స్పందించారు. దాంతో ఛైర్మన్ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేయడంతో సభలో గందరగోళ వాతావరణం ఏర్పడింది.

ఛైర్మన్ వైఖరిని నిరసిస్తూ విపక్షాలు వాకౌట్ చేశాయి. ఇటీవల రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణసింగ్.. 'జయా అమితాబ్ బచ్చన్' మాట్లాడాలంటూ ఆహ్వానించారు. దీనిపై జయాబచ్చన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. 'జయా బచ్చన్ అంటే సరిపోతుంది' అంటూ పేర్కొన్నారు. 'రికార్డుల్లో మీ పూర్తి పేరు ఇలానే ఉంది' అంటూ చెప్పగా.. 'మహిళలకు స్వతహాగా గుర్తింపు లేదా' అంటూ ఆ రోజు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.




# విద్యాసంస్థల్లో హిజాబ్‌లు ధరించొచ్చు.. సుప్రీం సంచలన తీర్పు

ఢిల్లీ: కళాశాల క్యాంపస్‌లలో విద్యార్థులు హిజాబ్‌లు ధరించడాన్ని నిషేధిస్తూ ముంబయికి చెందిన ఓ ప్రైవేట్ కాలేజీ ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. హిజాబ్‌పై నిషేధం విధిస్తే మహిళా సాధికారత ఎలా సాధ్యపడుతుందని కళాశాల యాజమాన్యాన్ని కోర్టు ప్రశ్నించింది. హిజాబ్ ధరించేందుకు ముస్లిం విద్యార్థినులకు అనుమతించింది. ఈ కేసుపై గతంలో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై కూడా సుప్రీం స్టే విధించింది. కళాశాల యాజమాన్యం తీరుపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

**ఏం ధరించాలేనేది మీరెలా నిర్ణయిస్తారు..** ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విద్యార్థినులు ఏం ధరించాలో కాలేజీలు నిర్ణయిస్తే మహిళా సాధికారికత మాటేంటని ప్రశ్నించింది. కళాశాలలో అందరూ సమానమని, మతాల ప్రదర్శనకు అది వేదిక కాకూడదనే ఉద్దేశంతోనే తాము హిజాబ్‌ని నిషేధించామని.. చెంబూరు(ముంబయి) కళాశాల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

దీనిపై కోర్టు స్పందిస్తూ.. పేర్లల్లో కూడా మతం ఉంటుందని.. మరి దాన్ని ఎలా తొలగిస్తారని కళాశాల యాజమాన్యాన్ని తిరిగి ప్రశ్నించింది. "అమ్మాయిలు ఏం ధరించాలనేది వారి వ్యక్తిగత నిర్ణయం. దేశంలో అనేక మతాల ప్రజలు నివసిస్తున్న విషయం కళాశాల యాజమాన్యానికి తెలియదా? స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లకుపైనే అవుతున్నా.. ఇప్పటికీ ఇలాంటి అంశాలపై చర్చ రావడం దురదృష్టకరం. మేం ఇచ్చిన ఉత్తర్వులను దుర్వినియోగం చేయకూడదు" అని కోర్టు తదుపరి విచారణను నవంబర్ 18కి వాయిదా వేసింది. కాలేజ్‌లో హిజాబ్ నిషేధంపై పలువురు విద్యార్థినులు సుప్రీం తలుపుతట్టగా.. తాజాగా ధర్మాసనం తీర్పు వెలువరించింది. ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులను ఎవరూ దుర్వినియోగం చేయరాదని అలాంటిదేమైనా జరిగితే తమని ఆశ్రయించవచ్చని.. విద్యా సంఘాలకు సూచించింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం 'ఎన్‌జీ ఆచార్య అండ్ డీకే మరాఠే కాలేజీ'ని నిర్వహిస్తున్న చెంబూర్ ట్రాంబే ఎడ్యుకేషన్ సొసైటీకి నోటీసులు జారీ చేసింది. నవంబర్ 18లోగా ఈ అంశంపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

# ఏపీలో రెడ్ బుక్ పాలన సాగుతోంది: వైఎస్ జగన్




నంద్యాల: మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏపీలో కూటమి ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. "రాష్ట్రవ్యాప్తంగా రెడ్ బుక్ పాలన సాగిస్తున్నారు. ఊళ్లలో ఆధిపత్యం కోసం వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. రాళ్లు, రాడ్లు, కత్తులతో గ్రామంలో దాడులు చేస్తున్నారు. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదు. రాష్ట్రంలో ఆరాచక పాలన జరుగుతుంది. చంద్రబాబు మహిళలను మోసం చేశారు. ప్రతి విద్యార్థికి రూ. 15 వేలు ఇస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేశారు. ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పారు. మన ప్రభుత్వమే ఉండి ఉంటే ఇప్పటికే అందరికి రైతు భరోసా అందేది" అని వైఎస్ జగన్ అన్నారు. నంద్యాల జిల్లా సీతారామాపురంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుబ్బారాయుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లారు. పరామర్శ అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అడుగుతారేమోనని సీఎం చంద్రబాబు భయానకం వాతావరణ కల్పిస్తున్నారంటూ జగన్ తనదైన శైలిలో ఆరోపణలు చేశారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇంటింటికి టీడీపీ వాళ్లను పంపించి అనేక హామీలు ఇస్తామని చెప్పించారని, కానీ అధికారంలోకి రాగానే మోసం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. జగన్ అధికారంలో ఉండుంటే ప్రతి రైతుకు సొమ్ము అందేదని, అందరికీ సంక్షేమ పథకాలు అందేవని పేర్కొన్నారు. గ్రామాల్లో ఆధిపత్యం కోసం దాడులు చేస్తూ లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టిస్తున్నారని, సీతారామాపురంలో సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు పోలింగ్ బూత్‌లో ఏజెంటుగా కూర్చున్నాడని, అతడిని దారుణంగా హత్య చేశారని ఆరోపణలు చేశారు.

ఈ ఘటనతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా అని అనుమానం కలుగుతోందని వ్యాఖ్యానించారు. నారపురెడ్డి అనే వ్యక్తి ఎస్పైకి ఫోన్ చేసినా పోలీసులు సకాలంలో స్పందించ లేదని, కొంతసేపటికి ఎస్పై ఊరికి వచ్చినా పైఅధికారులకు ఫోన్లు చేస్తూ ప్రేక్షక పాత్ర పోషించారని నిందలు వేశారు. నారపురెడ్డి అనే వ్యక్తి ఫోన్ చేసినా పోలీసులు అదనపు బలగాలను పంపలేదని అన్నారు.

**ఎమ్మెల్యే బుడ్డారెడ్డి హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు: వైఎస్ జగన్ –** సుబ్బరాయుడుని హత్య చేసిన వారిని పోలీసులు వెంటనే ఎందుకు అరెస్టు చేయలేదని జగన్ ప్రశ్నించారు. నిందితుల కాల్ డేటా బయటకు తీస్తే అసలు వ్యక్తులు వెలుగులోకి వస్తారని, కేవలం మర్డర్ చేసిన వారిపైనే కాదు, హత్య చేయించిన వారిపై కూడా కేసులు నమోదు చేయాలని జగన్ డిమాండ్ చేశారు. సీతారామాపురంలో హత్యకు గురైన సుబ్బారాయుడు కుటుంబానికి అండగా ఉంటానని, నిందితులకు కఠిన శిక్ష పడేంత వరకు న్యాయ పోరాటం చేస్తానని అన్నారు. ఇక సుబ్బరాయుడు కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని జగన్ డిమాండ్ చేశారు. ఇక శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి హత్యా రాజకీయాలను ప్రోత్సాహిస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. మండలానికి ఇద్దరిని చంపాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మీటింగ్‌లో చెప్పారని, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోందని మాజీ సీఎం అన్నారు. బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయ లేదని ఆయన ప్రశ్నించారు.

# ఏపీలో విత్తనాల కొరత లేదా..? ఏపీ ప్రభుత్వానికి షర్మిల సూటి ప్రశ్నలు



అమరావతి: విత్తనాల కోసం రైతులు తిప్పలు పడుతున్నారని.. క్యూలైన్లు కడుతుంటే ప్రభుత్వానికి కనిపించట్లేదా అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. విత్తనాల కొరతపై వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఇచ్చిన వివరణ తలా తోక లేకుండా ఉందని విమర్శించారు. సాగర్ కుడికాలువ కింద రైతులకు విత్తన కొరత లేదని గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పగలరా..? అని నిలదీశారు. కూటమి ప్రభుత్వంపై వైఎస్ షర్మిల ట్విట్టర్ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. "పల్నాడు జిల్లాలో కౌంటర్ల దగ్గర రైతుల పడుతున్న కష్టాలు మీకు కనిపించడం లేదా..? సంబంధిత శాఖ మంత్రిగా నేరుగా పరిస్థితి చూసే మాట్లాడుతున్నారా..? రాత్రంతా క్యూలైన్లో రైతులను నిలబెట్టడమా మీ ఎన్డీఏ ప్రభుత్వ కట్టుబడి ఇదేనా.. ? సంక్షోభం నుంచి సంక్షేమం అంటే కుండపోత వర్షంలో మహిళలను ఇబ్బందులు పాలు చేయడమే కాబోలు! రైతుల గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పే దమ్ము లేక కుటుంబాన్ని గుంజుతున్నారు. %బూ% ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టకనే కదా.. మీకు పట్టం కట్టింది. మాజీ సీఎం జగన్ నిండా ముంచారు అనే కదా 11 సీట్లకు పరిమితం చేసింది. మోసం చేశారు అనే కదా కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదు. రైతులను వ్యతిరేకించే బీజేపీతో మీరు కూటమి కట్టి, పక్షపాతిగా ఉంటామని హామీలు ఇచ్చి, గద్దెనెక్కి, ఇప్పుడు వాళ్లను వర్షంలో నిలబెట్టారు. ఇది మీ సర్కారుకి న్యాయమా..? నాట్లు వేసిన 130 రోజుల్లోనే పంట చేతికి వస్తుందని జేజీఎల్:384 రకం విత్తనాలను కావాలని అడగటం రైతులు చేసిన పాపం అంటారా మంత్రిగారు ! రైతు అడిగింది ఇవ్వాలని హక్కుగా మేము ప్రశ్నిస్తే.. రెచ్చ గొట్టినట్లు ఎలా అవుతుందో, వ్యవసాయ శాఖ మంత్రిగారు సమాధానం చెప్పాలి" అని షర్మిల డిమాండ్ చేశారు.

# అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వర్ణ తాపడంతో ధ్వజస్తంభం



అన్నవరం: కాకినాడ జిల్లాలోని అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వర్ణ తాపడంతో చేసిన ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. అనివెట్టి మండపంలో ధ్వజస్తంభానికి బంగారు తాపడంతో తయారు చేసిన కవచాన్ని అమర్చారు.

నెల్లూరుకు చెందిన దాత సహకారంతో రూ.2 కోట్లు ఖర్చుతో దీన్ని ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా నిడుబ్రోలు నుంచి తీసుకువచ్చిన నారేప కర్రతో సుమారు 60 అడుగుల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. దీనికి సుమారు 300 కిలోల రాగిని వినియోగించడంతో పాటు.. దానిపై 1,800 గ్రాముల బంగారు తాపడం చేశారు. స్తంభానికి అమర్చిన స్వర్ణ రేకుపై అష్ట లక్ష్ములు, దశావతారాలు, పంచాయతనాలు తీర్చిదిద్దారు. వైదిక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ అనంతరం ధ్వజస్తంభ ప్రదక్షిణకు భక్తులను అనుమతించారు.




## పొట్టి గౌనులో లవ్లీ పాప గుర్తుపట్టారా?

నార్త్ బ్యూటీస్ కి సౌత్ ఇండియాలో ఉండే క్రేజ్ మామూలుగా ఉండదు. చాలా కాలంగా ఎంతో మంది నార్త్ ముద్దుగుమ్మలు సౌత్ లో స్టార్ హీరోయిన్స్ గా సత్తా చాటారు. ఇక లవ్ లీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన బ్యూటీ శాన్వీ శ్రీ వాస్తవ. తరువాత అడ్డా, రౌడీ, ప్యార్ మే పడిపోయానే సినిమాలలో శాన్వీ శ్రీవాస్తవ హీరోయిన్ గా చేసింది. చంద్రలేఖ మూవీతో కన్నడంలోకి ఈ అమ్మడు అడుగుపెట్టింది. ప్రేమకథాచిత్రమ్ రీమేక్ గా ఆ సినిమా తెరకెక్కింది. కన్నడంలో కూడా చంద్రలేఖ సూపర్ హిట్ అయ్యింది. దాంతో కన్నడనాట శాన్వీ వరుసగా అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. తెలుగులో అవకాశాలు రాకపోయిన కన్నడంలో మాత్రం స్టార్ హీరోలతో శాన్వీ జతకట్టింది. కేజీఎఫ్ స్టార్ యష్ కి జోడీగా మాస్టర్ పీస్ అనే సినిమాలో శాన్వీ నటించింది.



అలాగే రక్షిత్ శెట్టితో అవనే శ్రీమన్నారాయణ మూవీలో నటించింది. ప్రస్తుతం కన్నడంలో ఒక మూవీ, మరాఠీలో ఒక సినిమా శాన్వీ చేస్తోంది. తెలుగులో గట్టిగా ప్రయత్నాలు చేసిన ఎందుకనో ఆశించిన స్థాయిలో శాన్వీ ఛాన్స్ లు అందుకోలేకపోయింది. ఈ బ్యూటీ ఇన్ స్టాగ్రామ్ లో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన గ్లామర్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో పంచుకుంటుంది. హాట్ హాట్ ఫోటోషూట్ లు కూడా షేర్ చేస్తూ ఉంటుంది. ఇవి సోషల్ మీడియా కూడా వైరల్ అవుతాయి. తాజాగా వైట్ కలర్ గౌనులో శాన్వీ శ్రీవాస్తవ అదిరిపోయే లుక్స్ తో ఫోటోలని షేర్ చేసింది. ఈ పిక్స్ నెటిజన్లని ఇట్టే ఆకర్షిస్తున్నాయి. శాన్వీ గ్లామర్ కి ఎవరైనా క్లీన్ బౌల్డ్ అవ్వాల్సిందే అనే కామెంట్స్ నెటిజన్లు నుంచి వినిపిస్తున్నాయి. ఓ స్టార్ హోటల్ ముందు స్టైలిష్ గా నడుచుకుంటూ వస్తున్నట్లు ఈ ఫోటోలలో శాన్వీ కనిపిస్తోంది. రాండమ్ గానే వీటిని షూట్ చేసినట్లు అనిపిస్తోంది. ఏంజిల్ గా ఈ ఫోటోలలో ఆమె మెరిసిపోతుందని అంటున్నారు.

## అక్కడ ఓకే మరి ఇక్కడ పాపని పట్టించుకోరేంటి..?

పాన్ ఇండియా లెవెల్ లో సత్తా చాటుతున్న తెలుగు సినిమాల్లో ఛాన్సుల కోసం అందరు ఎదురుచూస్తున్నారు. ఆల్రెడీ ఇక్కడ స్టార్ డం తెచ్చుకుని ఈమధ్య కాస్త ఫాం కోల్పోయిన హీరోయిన్స్ కూడా మళ్లీ తెలుగులో అవకాశాలు సాధించాలనే గురితో ఉన్నారు. అలాంటి వారిలో బుట్ట బొమ్మ పూజా హెగ్దే లిస్ట్ లో ఫస్ట్ ఉంటుంది. మొన్నటిదాకా తనకు తిరుగు లేదు అనే రేంజ్ లో టాలీవుడ్ లో వరుస ఆఫర్లు అందుకున్న అమ్మడు సడెన్ గా ఖాళీ అయిపోయింది. దాని వెనక కారణాలు ఏంటన్నది తెలియదు కానీ ఒకప్పుడు పూజా హీరోయిన్ గా కావాలని అనుకున్న వారంతా ఇప్పుడు పూర్తిగా ఆమెను అవైడ్ చేస్తున్నారు. గుంటూరు కారం సినిమా నుంచి పూజా హెగ్దే ఎగ్జిట్ అవ్వడమే ఆమెను టాలీవుడ్ కి దూరం చేసిందని చెబుతున్నా అది కాకపోతే మరో ఛాన్స్ అయినా రావాలిగా అని అంటున్నారు. ఐతే తెలుగులో ఆఫర్లు రాకపోయినా పూజాకి బాలీవుడ్, కోలీవుడ్ నుంచి అవకాశాలు వస్తున్నాయి. హిందీలో ఆల్రెడీ ఒక సినిమాకు సైన్ చేసిన పూజా బేబీ కోలీవుడ్ లో కూడా సూర్య సినిమాలో ఛాన్స్ అందుకుంది. తెలుగులో తప్పితే పూజాకు అక్కడ బాగానే ఆఫర్లు



వస్తున్నా అమ్మడు మాత్రం తెలుగులో ఒక్క ఛాన్స్ అంటున్నట్టు తెలుస్తుంది. ఐతే నాగ చైతన్య నెక్స్ట్ సినిమాలో పూజా హెగ్దేని తీసుకునే అవకాశాలు ఉన్నట్టు చెబుతున్నారు. అదే జరిగితే మాత్రం పూజా హెగ్దేకి మళ్లీ లక్కీ ఛాన్స్ వచ్చినట్టే అని చెప్పొచ్చు.

ఈసారి అవకాశం వస్తే తనని మళ్లీ మళ్లీ తీసుకునేలా రెచ్చిపోయేందుకు సిద్ధమైంది పూజా హెగ్దే. ఇప్పటికే ఆఫర్లు తగ్గాయి అనిపించిన ప్రతిసారి సోషల్ మీడియాలో ఫోటో షూట్స్ తో రెచ్చిపోతున్న పూజా హెగ్దే బాలీవుడ్, కోలీవుడ్ నుంచి అవకాశాలు వస్తున్నా తన ఫోకస్ మాత్రం టాలీవుడ్ మీదే పెట్టింది. మరి అమ్మడు ఇంతగా ఎదురుచూస్తున్న ఆ అవకాశాన్ని ఎవరు ఇస్తారన్నది చూడాలి. పూజా హెగ్దే నెక్స్ట్ తెలుగు సినిమా కోసం ఆమెను అభిమానించే మన ఆడియన్స్ కూడా ఎగ్జైటింగ్ గా ఉన్నారు. స్టార్ ఛాన్సులు కాకపోయినా టైర్ 2 హీరోల సినిమాలు వచ్చినా చేసేందుకు రెడీ అంటుంది పూజా హెగ్దే. కోలీవుడ్ లో మాత్రం సూర్య సినిమాకు ఓకే అవ్వగానే మరో రెండు సినిమాలు డిస్కషన్ లో ఉన్నాయని తెలుస్తుంది.

## మెకానిక్ రాకీ.. కల్లు గిలాసు లంటూ పాట!





విశ్వక్ సేన్ హీరోగా రవితేజ ముళ్ళపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మెకానిక్ రాకీ మూవీ షూటింగ్ కంప్లీట్ చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అక్టోబర్ 31న ఈ చిత్రంలో థియేటర్స్ లోకి రానుంది. కమర్షియల్ యాక్షన్ ఎంటర్టైనర్ గా ఈ చిత్రాన్ని రవితేజ ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. విశ్వక్ సేన్ ఈ చిత్రంలో మెకానిక్ క్యారెక్టర్ లో కనిపిస్తున్న చాలా స్టైలిష్ గా ఉన్నాడు. మీనాక్షి చౌదరి ఈ మూవీలో హీరోయిన్ గా నటించింది.

రామ్ తాళ్ళూరి ఈ సినిమాని నిర్మించారు. ఇదిలా ఉంటే ఇప్పటికే ఈ మూవీ ప్రమోషన్స్ ని చిత్ర యూనిట్ స్టార్ట్ చేసింది. అందులో భాగంగా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేశారు. దీనికి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మెకానిక్ రాకీ నుంచి ఫస్ట్ సింగిల్ ని ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చారు. ఈ సాంగ్ కి మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ మధ్యకాలంలో తెలంగాణ ఫోక్ బీట్స్ ని సినిమాలలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. తెలంగాణ సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నారు. ఈ సాంగ్ కూడా అదే స్టైల్ లో సాగింది. గుల్లెడు గుల్లెడు గులాబీలు అంటూ సాగే ఈ పాటని మంగ్లీ ఆలపించింది. సుద్దాల అశోక్ తేజ చాలా కాలం తర్వాత తన పెన్నుకి పదును పెట్టి మరో పసందైన తెలంగాణ ఫోక్ సాంగ్ ని రాసారు. పెళ్లి సెటప్ బ్యాక్ డ్రాప్ లో మీనాక్షి చౌదరి పాయింట్ ఆఫ్ వ్యూలో హీరోని ఉద్దేశించి ఆమె పడుతున్నట్లు పాట ఉంది. అదిరిపోయే మెలోడీ బీట్ తో ఈ సాంగ్ కి జెక్స్ బిజోయ్ సంగీతం అందించారు.

ఫిదా, ప్రేమకథ చిత్రాలలో సాయి పల్లవి సాంగ్స్ ఎంత ఫేమస్ అయ్యాయో అందరికి తెలిసిందే. అలాగే ఈ సాంగ్ కూడా పెళ్లిళ్ల సందడిలో గట్టిగా వినిపించే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. మెకానిక్ రాకీ సినిమాలో సునీల్ పవర్ ఫుల్ విలన్ గా నటిస్తున్నాడు. శ్రద్ధా శ్రీనాథ్ మరో హీరోయిన్ గా కనిపిస్తోంది. నెటిజన్లు నుంచి ఈ పాటకి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వస్తోంది. ఈ మూవీ సాంగ్ ప్రేక్షకులకి బాగా కనెక్ట్ కావడంతో సినిమాపైన అటెన్షన్ క్రియేట్ అవుతోంది. నెక్స్ట్ రాబోయే సాంగ్స్ ట్రైలర్ మూవీపై ఏ స్థాయిలో ఇంప్రెషన్స్ పెంచుతాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## 'మిస్టర్ బచ్చన్' షో రీల్.. ఇది మాస్ కిక్




టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ ప్రస్తుతం మిస్టర్ బచ్చన్ మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. నామ్ తో సునా హోగా ట్యాగ్ లైన్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రవితేజ, హరీష్ శంకర్ కాంబోలో వచ్చిన షాక్, మిరపకాయ్ సినిమాలు మంచి హిట్ అయ్యాయి. దీంతో మిస్టర్ బచ్చన్ మూవీపై సినీ ప్రియులతో పాటు రవితేజ ఫ్యాన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ గ్రాండ్ గా నిర్మిస్తున్న ఈ సినిమా.. బాలీవుడ్ హిట్ మూవీ రైడ్ కు రీమేక్ గా తెరకెక్కుతోంది. సినిమాలో రవితేజ బిగ్ బి అమితాబ్ బచ్చన్ ఫ్యాన్ గా కనిపించనున్నారు. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్ లో అమితాబ్ పోజులో కనిపించి ఆకట్టుకున్నారు రవితేజ. భాగ్యశ్రీ బొర్సే హీరోయిన్ గా యాక్ట్ చేస్తోంది. ఈ సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇస్తోంది. ప్రస్తుతం మూవీ షూటింగ్ స్పీడ్ గా జరుగుతోంది. ఇప్పటి వరకు సినిమా నుంచి పోస్టర్లను రిలీజ్ చేసిన మిస్టర్ బచ్చన్ మేకర్స్.. తాజాగా షో రీల్ పేరుతో ఫస్ట్ గ్లింప్స్ ను విడుదల చేశారు. ఎలాంటి డైలాగ్స్ లేకుండా ఫుల్ మాస్ ఎంటర్టైనర్ గా సాగుతుంది షో రీల్. వీడియో అంతా రవితేజ తన మాస్ యాక్షన్ తో వేరే లెవల్ లో అలరించారు. చెప్పాలంటే.. తనదైన మాస్ స్వాగ్ తో ఆయన అదరగొట్టేశారు. అయితే డైలాగ్స్ లేకపోయినా.. యాక్షన్ లో క్లియర్ గా హరీష్ శంకర్ మార్క్ కనిపించింది. మిస్టర్ బచ్చన్ లో రవితేజ ఇన్ కమ్ టాక్స్ ఆఫీసర్ గా కనిపించనున్నట్లు లేటెస్ట్ గ్లింప్స్ చూస్తుంటే ఈజీగా తెలుస్తుంది. ఇన్ కమ్ ట్యాక్స్ ఆఫీసర్ గా రవితేజ.. పెద్ద రాజకీయ నాయకుడి ఇంటికి రైడ్ కు వెళ్లాక ఏం జరిగిందనే అంశంతో మూవీని తెరకెక్కిస్తున్నట్లు అర్థమవుతుంది. 1990 బ్యాక్ డ్రాప్ లో ఈ సినిమా రూపొందుతున్నట్లు కనిపిస్తోంది. మూవీలో యాక్షన్ తో పాటు లవ్ ఎలిమెంట్ కూడా ఉండబోతున్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. రాజకీయ నాయకుడి పాత్రలో జగపతిబాబు నటిస్తున్నట్లు చూపించారు మేకర్స్. ఆ తర్వాత భాగ్య శ్రీ బొర్సేని కూడా పరిచయం చేశారు. కాసేపే ఆమె ఉన్నా ఆకట్టుకుంటోంది. మిక్కీ జే మేయర్ అందించిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ బాగుంది. మొత్తానికి ప్రమోషన్స్ లో భాగంగా రిలీజ్ చేసిన మిస్టర్ బచ్చన్ గ్లింప్స్.. అదిరిపోయిందని నెటిజన్లు చెబుతున్నారు. ఫ్యాన్స్ అయితే పండుగ చేసుకుంటున్నారు. మరి ఈ మూవీ ఎప్పుడు రిలీజ్ అవుతుందో చూడాలి.

## లెగ్స్ అందాలతో రకుల్ స్టన్నింగ్ లుక్

కెరటం సినిమాతో టాలీవుడ్ లోకి హీరోయిన్ అడుగుపెట్టిన అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్. ఆ తరువాత వచ్చిన వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ తో రకుల్ కి మొదటి హిట్ పడింది. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా వరుసగా తెలుగులో ఆఫర్స్ ని ఈ పంజాబీ బ్యూటీ అందుకుంది. తెలుగు, తమిళ్ భాషలలో రకుల్ ప్రీత్ సింగ్ కి అవకాశాలు పెంచుకుంటూ స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. అల్లు అర్జున్, ఎన్టీఆర్, రామ్ చరణ్, మహేష్ బాబు లాంటి స్టార్స్ తో రకుల్ ప్రీత్ సింగ్ జతకట్టింది. అలాగే రారండోయ్ సినిమాలో నాగ చైతన్యకి జోడీగా నటించిన రకుల్ ప్రీత్ సింగ్ మన్మథుడు 2లో కింగ్ నాగార్జునతో నటించింది. చివరిగా ఆమె తెలుగులో కొండపొలం సినిమాలో వైష్ణవ్ తేజ్ కి జోడిగా చేసింది. అంతకంటే ముందుగానే బాలీవుడ్ లో కూడా రకుల్ ప్రీత్ సింగ్ అవకాశాలు పెంచుకుంది. తరువాత హిందీలో వరుస ఛాన్స్ లు



రావడంతో రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్ కి ఆల్ మోస్ట్ దూరం అయ్యింది. తెలుగు ఆఫర్స్ వస్తున్న కూడా కాల్ షీట్స్ అడ్జస్ట్ చేయలేక వదులుకుంటుందని తెలుస్తోంది. ఈ బ్యూటీ హిందీలో నిర్మాత, యాక్టర్ అయిన జాకీ భగ్నానితో చాలా కాలంలో రిలేషన్ లో ఉంది. ఈ ఏడాది ఆరంభంలోనే పెళ్లి చేసుకుంది. పెళ్లి తర్వాత కూడా రకుల్ ప్రీత్ సింగ్ నటిగా కెరియర్ కొనసాగిస్తోంది. ఈ ఏడాది ఇండియన్ 2తో రకుల్ ప్రీత్ సింగ్ ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. హిందీలో దే దే ప్యార్ దే 2, మేరీ పత్ని కా రీమేక్ సినిమాలలో ప్రస్తుతం నటిస్తోంది. ఇదిలా ఉంటే ఉంటే రకుల్ ప్రీత్ సింగ్ ఇన్ స్టాగ్రామ్ లో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా తన గ్లామర్ ఫోటోషూట్ లని షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్ స్టాగ్రామ్ లో రకుల్ ప్రీత్ సింగ్ కి 23.7 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. అందుకే ఈమె పెట్టే ప్రతి పోస్ట్ కి లక్షల్లో లైక్స్ వస్తూ ఉంటాయి. రీసెంట్ గా ఈ బ్యూటీ తెరవెనుక అంటూ ఈ షూట్ లో మ్యాకప్ వేసుకుంటున్న ఫోటోల ని షేర్ చేసింది. వైట్ కలర్ లాంగ్ ఫ్రాక్ ధరించి చాలా గ్లామరస్ గా ఈ పిక్స్ లో రకుల్ ప్రీత్ సింగ్ కనిపిస్తోంది. ఈ ఫోటోలని ఏకంగా 1.86 లక్షల మంది లైక్ చేశారు. ఈ పిక్స్ చూసిన తర్వాత రకుల్ ప్రీత్ సింగ్ లో అందం రోజు రోజుకి పెరిగిపోతుందని ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. తెలుగు తెరపై మళ్ళీ రకుల్ ని చూడాలని అనుకుంటున్నట్లు కామెంట్స్ చేస్తున్నారు.

## హనీ రోజ్ 'రాహేలు'.. టీజర్ ఎలా ఉందంటే?

సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ వీర సింహా రెడ్డి మూవీతో టాలీవుడ్ లోకి మాలీవుడ్ బ్యూటీ హనీ రోజ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ సినిమాలో బాలయ్యకు సరైన జోడీ అనిపించుకుంది. తన అందం, అభినయంతో తెలుగు సినీ ప్రియులను ఆకట్టుకుంది. కిర్రాక్ గ్లామర్ తో కుర్రాళ్ల మనసులు దోచేసింది. టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ ను సంపాదించుకుంది. వేరే లెవల్ లో ఫ్యాన్ బేస్ ను సొంతం చేసుకుంది. అయితే హనీ రోజ్ ను సిల్వర్ స్క్రీన్ పై చూసి చాలా నెలలు అవుతుంది. కానీ ఆమెకు క్రేజ్ మాత్రం అలానే ఉంది. చెక్కుచెదరలేదనే చెప్పాలి. సోషల్ మీడియాలో ఎప్పుడూ తన ఫ్యాన్స్ తో టచ్ లో ఉంటోంది. గ్లామర్ ఫోటోలు పోస్ట్ చేస్తూ నెట్టింట సెగలు పుట్టిస్తుంటోంది. సినిమాలతో సందడి చేయకపోయినా.. నెట్టింట ట్రెండింగ్ లోనే ఉంటోంది. షాపింగ్ మాల్స్ ఓపెనింగ్స్ తోపాటు ఏదో ఒక ఈవెంట్ లో కనిపిస్తూనే ఉంటోంది. ఇక హనీ రోజ్.. చాలా నెలల క్రితం రాహేలు అనే పాన్ ఇండియా




మూవీని అనౌన్స్ చేసింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఆ మూవీని విడుదల చేయనున్నట్లు తెలిపింది. అప్పుడు ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా మేకర్స్ రిలీజ్ చేశారు. అందులో హిట్ పుట్టించే లుక్ లో అందరినీ ఆశ్చర్యపరిచింది. కత్తి పట్టుకుని బీఫ్ కొడుతూ షాకింగ్ లుక్ లో కనిపించింది. ఇప్పుడు చాలా నెలల తర్వాత ఈ మూవీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. తాజాగా సినిమా టీజర్ ను సోమవారం రిలీజ్ చేశారు. 'చీకట్లో నేను చూసిన ఆ ఎరుపెక్కిన కళ్లు కలైతే కాదు.. అది కలే అయినా వాటిని మర్చిపోను వెతకాలి చంపాలి' అంటూ హనీ రోజ్ డైలాగ్ తో టీజర్ ప్రారంభమైంది. గ్లామర్ తో పాటు కత్తి పట్టుకుని ఎవరిపైనో ఎదురుదాడికి దిగుతున్నట్లు చూపించారు. చివర్లో ఎవరో చనిపోయినట్లు కూడా కనిపించారు. మొత్తానికి ఈ సినిమా మంచి గ్రిప్పింగ్ యాక్షన్ థ్రిల్లర్ గా ఉండనున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. మూవీపై ఇంట్రెస్ట్ కూడా పెంచుతోంది. ఆనందిని బాలా తెరకెక్కిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే కంప్లీట్ అయింది. బాదుషా ప్రొడక్షన్స్ బ్యానర్ పై అబ్రిడ్ షైన్, షినోయ్ మాథ్యూ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇషాన్ ఛబ్రా సంగీతం అందిస్తున్నారు. స్వరూప్ ఫిలిప్ సినిమాటోగ్రఫర్ గా వ్యవహరిస్తున్నారు. బాబూరాజ్, కళాభవన్ షాజోన్, రోషన్ బషీర్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. మరి ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో చూడాలి.



# తెలంగాణను 'ఫ్యూచర్ స్టేట్' ట్యాగ్‌లైన్‌తో పిలుద్దాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ఇకపై తెలంగాణను 'ఫ్యూచర్ స్టేట్' అనే ట్యాగ్ లైన్‌తో పిలుద్దామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో ఫ్యూచర్ స్టేట్‌కు తెలంగాణ పర్యాయ పదంగా నిలుస్తుందని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం.. కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. టెక్ యూనికార్న్ సీఈవోలను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఐటీ యూనికార్న్ ప్రతినిధులను తెలంగాణకు ఆహ్వానించారు. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చదిద్దుకుందామని సీఎం పిలుపునిచ్చారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రపంచ టెక్ పరిశ్రమలకు తెలంగాణలో అనుకూలమైన వాతావరణం ఉందన్నారు.



# దారుణం.. ధరణిలో భూమి నమోదు కాలేదని యువరైతు ఆత్మహత్య

నిజామాబాద్: జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ధరణిలో భూమి నమోదు కాకపోవడం, అప్పులబాధతో యువరైతు రాజేశ్ ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామానికి చెందిన రైతు రాజేశ్ వ్యవసాయంతోపాటు మరో వ్యాపారం చేశారు. అయితే రెండింటిలోనూ సుమారు రూ.12లక్షలు మేర నష్టపోయాడు. అప్పులు, వాటి వడ్డీలు బాగా పెరిగిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. అయితే తనకు ఉన్న రెండెకరాల భూమి అమ్మి అప్పులు తీర్చాలని రైతు ప్రయత్నించాడు. అయితే అక్కడే రైతుకు మరో సమస్య ఎదురైంది. ధరణిలో భూమి నమోదు కాకపోవడంతో దాన్ని అమ్మేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు.

తన పిల్లలకు ఎలాంటి హానీ తలపెట్టొద్దని ఆత్మహత్యకు ముందు రికార్డు చేసిన ఆడియో వైరల్‌గా మారింది. ఆడియో విన్న వారంతా కన్నీటి పర్యంతం అవుతున్నారు. రైతుల పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఘటనపై కేసు నమోదు చేసిన జక్రాన్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఆగస్టు 15న రైతులను రుణ విముక్తి చేస్తాం..




ఖమ్మం, ఆగస్టు 9: కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రాష్ట్ర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 2 లక్షల రైతుల రుణ మాఫీ చేస్తాం అని హామీ ఇచ్చామని.. చేసి చూపిస్తున్నామని తెలిపారు. జూలై 15 న జీవో ఇచ్చామని.. 18 జూలైన ఒక లక్ష రూపాయల రుషమాఫీ 6,983 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రెండవ సారీ రూ.6190.02 కోట్లతో జూలై మాసంలో మళ్ళీ విడుదల చేశామన్నారు. లక్షన్నర వరకు రుణం ఉన్న వాళ్ళందరికి నేరుగా 12289 కోట్లు 16.29 లక్షల కుటుంబాలకు నిధులు విడుదల చేశామని తెలిపారు. రెండు లక్షల వరకు ఆగష్టు 15లోపు చేస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో నిబద్ధతతో పని చేస్తున్నామన్నారు. ఆగస్ట్ 15లోపు రుణాలు వైరాలో భారీ రైతు బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గం, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున పాల్గొంటారన్నారు. వైరా నుంచి ఆగష్టు 15న రాష్ట్రంలో రైతులకు రుణ విముక్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతుల రుణమాఫీ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చాలెంజ్ చేశారని.... కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టడం కోసం వైరా సభలో రైతులు పండుగ లాగా పాల్గొని మన రైతాంగ సోదరులు మంచి సందేశం ఇచ్చేలా సభ జరుపుతామన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రుణ మాఫీ ఒక్కటే కాదు... రైతు భీమాకి సంబంధించి ఒక వెయ్యి , 500 కోట్లు రైతుల తరుపున ప్రభుత్వం కడుతుందన్నారు. క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ కూడా చేస్తున్నామన్నారు. రైతులు కట్టాల్సిన రూ.1,350 కోట్లు కడుతున్నామని వెల్లడించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.72 వేల కోట్లు కేటాయించామన్నారు. పండే ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఉద్యానవన పంటలు, డ్రిప్, సింప్సన్‌కు ఆధునీకరణకు నిధులు మంజూరు చేశామన్నారు. రూ.1,450 కోట్లతో పూర్తి చేసే రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను రీ డిజైన్ చేసి సీతారామ పేరు పెట్టి కేసీఆర్ ప్రభుత్వం రూ.23 వేల కోట్లుకు పెంచి దోపిడీ చేసిందని ఆరోపించారు. ఆనాటి నుంచి కాంగ్రెస్ ఖండిస్తూ వస్తోందన్నారు. రూ.8 వేల కోట్లు ఖర్చు పెట్టినా ఒక ఎకరాకు నీరు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రుల సమక్షంలో రివ్యూ చేశామన్నారు. తక్కువ ఖర్చుతో నీళ్ళు పారించే విధానంతో అతి తక్కువ ఖర్చుతో కేవలం రూ.75 కోట్లతో లక్షన్నర ఎకరాలు పండించేలా సీతారామ ప్రాజెక్ట్ లింకు కెనాల్‌తో పనులు చేశామన్నారు. ఎన్‌ఎస్‌పీ లింకు , వైరా కెనాల్‌కు లింకు కలపటమే రేపటి కార్యక్రమమని... ఇదీ మా నిబద్ధతకు తార్కాణం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# సుంకాశీల కర్త, కర్మ, క్రియా మొత్తం కేటీఆరే



ఢిల్లీ: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు 2021లో సుంకాశీల దగ్గర ఫౌండేషన్ వేశారని కాంగ్రెస్ ఎంపీ మల్లురవి తెలిపారు. మేఘ ఇంజినీరింగ్ వర్క్స్ కి నిర్మాణ పనులు దక్కాయని చెప్పారు. సుంకాశీలకు కర్త,కర్మ, క్రియా మొత్తం కేటీఆరే బాధ్యత అని స్పష్టం చేశారు. శుక్రవారం నాడు ఢిల్లీ వేదికగా మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ... 2021 లో పనులు మొదలుపెట్టి, 2023 కి పనులు పూర్తి చేశారని.. కొంతమేర శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు, పనులు, నిర్మాణ వ్యయం పెంపు వంటి అంశాలు అన్ని జరిగాయని గుర్తుచేశారు. రూ.14 00 కోట్లతో మొదలుపెట్టి రూ. 2వేల కోట్లకు పెంచింది కేసీఆర్ ప్రభుత్వమేనని తేల్చిచెప్పారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరు భారీగా చేరి వాల్ కూలిపోయిందని అన్నారు. నాసిరకంగా ప్రాజెక్టులు కట్టడం వల్ల తెలంగాణకు నష్టం జరిగిందని చెప్పారు. కేటీఆర్ ఇష్టారీతిన తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో ఏం చేసిన అడిగేవారు లేరన్నట్లు వ్యవహరించిన కేటీఆర్ సుంకాశీల దగ్గర పనులు మొదలుపెట్టారని చెప్పారు. కాళేశ్వరం కేసీఆర్, సుంకాశీల విషయంలో కేటీఆర్ బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ మాటలు రాజకీయాల్లో విలువ లేకుండా చేస్తున్నాయని అన్నారు. పెట్టుబడుల ఆకర్షణ కోసం పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ ఎందుకు విదేశాలకు వెళ్లలేదని ప్రశ్నించారు. కేటీఆర్ మీద నమ్మకం లేకే దావోస్ నుంచి పెట్టుబడులు రాలేదని విమర్శించారు. కేసీఆర్ వెళ్లలేదు కాబట్టే పెట్టుబడిదారులకు నమ్మకం కలగలేదని తేల్చిచెప్పారు. పెట్టుబడిదారులకు నమ్మకం కలిగించేందుకే సీఎం రేవంత్ రెడ్డి, సీఎంతోపాటు మంత్రి, అధికారులు అందరూ అమెరికా వెళ్లారని స్పష్టం చేశారు. కానీ బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులు అవాకులు చెవాకులు మాట్లాడటం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి రేవంత్ రెడ్డి సీఎం కాకముందు నుంచే అమెరికాలో ఉన్నారని.. చాలా ప్రాజెక్టుల్లో భాగం అయ్యారని గుర్తుచేశారు. నిర్ణిత సమయంలో ప్రాజెక్టులు ప్రారంభం కాకపోతే అప్పుడు అడగాలి, కానీ బీఆర్ఎస్ నేతలు వ్యక్తిగతంగా అప్రదిష్టపలు చేయాలని చేస్తున్నారని ఏకిపారేశారు. తెలంగాణ ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యం తో బీఆర్ఎస్ వ్యవహరించడం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీజేపీతో కుమ్మక్కై గులాబీ పార్టీ ఓట్లను బీజేపీకి ఓటు వేయించారని ఆరోపించారు. 8 మంది బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల డిపాజిట్లు పోయాయని గుర్తుచేశారు. కేసీఆర్ పార్టీకి నష్టం వచ్చిన కమలం పార్టీని బతికించేలా పనిచేయలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకే బీజేపీతో కలిసి పనిచేశారని విమర్శించారు. నిర్మాణాత్మక ప్రతిపక్ష పార్టీగా గులాబీ నేతలు వ్యవహరించడం లేదని, తిట్టడం, బద్నాం చేయడంతోనే కేసీఆర్ పార్టీ నేతలు సరిపెట్టుకుంటున్నారని మండిపడ్డారు. సుంకాశీలలో జరిగిన నష్టాన్ని ఆ కాంట్రాక్టర్‌తోనే భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. పైసా కూడా వృథా ఖర్చు చేయరాదని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు.

# కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో దోచుకుంది



ఖమ్మం జిల్లా: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో దోచుకుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. శుక్రవారం నాడు ఏన్కూర్ వద్ద సీతారామ ప్రాజెక్ట్ కాలువల నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... రీ డిజైన్ పేరుతో సీతారామ ప్రాజెక్టుకు రూ. 18వేల కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం పనులు చేపట్టి రూ.8 వేల కోట్ల ప్రజల సొమ్మును కాజేసిందని విమర్శించారు. కాళేశ్వరం, ఇరిగేషన్‌లో ప్రజల సొమ్ము లూటీ చేశారని ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రాజెక్టులు అన్ని సాగులోకి తెచ్చి రైతులకు ఉపయోగపడాలని శరవేగంగా పనులు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీతారామతో లక్షా 35 వేల ఎకరాలు వైరా, లంకా సాగర్ ప్రాజెక్టులు మైనర్ ఇరిగేషన్‌లో అనుసంధానం చేస్తున్నామని అన్నారు. ఈ నెల 15వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి సీతారామ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తారని వెల్లడించారు. రాబోయే కొద్ది రోజుల్లో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుకు అడ్డంకులు ఉన్నా అధిగమిస్తామని అన్నారు. లక్షా 75 వేల ఎకరాలు సాగులోకి మొదటి విడతలో తీసుకురాబోతున్నామని చెప్పారు. రైతుల రుణమాఫీ చేశామని తెలిపారు. రూ.లక్షా 50 వేల నుంచి 2లక్షల వరకు బ్యాంకులో రుణం ఉన్న అన్నదాతలకు మాఫీ చేస్తామని, రూ.31 వేల కోట్లు రైతులకు ఇచ్చే పరిస్థితి లేదని.. అయినా రైతుల ప్రభుత్వం కాబట్టి రుణమాఫీ చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రూ. 2లక్షలకు పైగా రుణాలు దాటిన రైతులు నగదు చెల్లించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇస్తామని అన్నారు. మొదటి విడతగా 4లక్షల ఇళ్లు అందజేస్తామని ప్రకటించారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు. నిరుపయోగంగా ఉన్న ఇళ్లను పూర్తి చేస్తామని అన్నారు. తెల్ల రేషన్ కార్డుల కోసం పేదలు ఎదురు చూస్తున్నారన్నారు. హెల్త్ కార్డు... తెల్లరేషన్ కార్డులు త్వరలోనే ఇస్తామని ప్రకటించారు. ధరణీ అనే భూతంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని దానికి మోక్షం కల్పిస్తామని తెలిపారు. అద్భుతమైన రెవెన్యూ చట్టం తీసుకుని రాబోతున్నామని స్పష్టం చేశారు. 80 వేలు పుస్తకాలు చదివిన దొరవారు సూచనలు చేస్తే పరిశీలించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం ప్రతి ఒక్కరి కలను నెరవేరుస్తుందని ఉద్ఘాటించారు. ప్రభుత్వ భూమి, నిధులు దుర్వినియోగం కాకుండా కాపాడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# ఆదివాసి గూడేల అభివృద్ధే నిజమైన ప్రగతి

## - డా.బి.ఆర్ అంబేడ్కర్ వర్సిటీ సదస్సులో మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ: దేశంలోని మారుమూల ప్రాంతాలు, ఆదివాసీ గూడేల అభివృద్ధి జరిగినప్పుడే నిజమైన ప్రగతి అని మంత్రి సీతక్క అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, పొలిటికల్ సైన్స్ విభాగం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో "ఆదివాసీ జీవనోపాధి పద్ధతులు: సాధికారత సాధనలో సమస్యలు, వ్యూహాలు" అనే అంశంపై నిర్వహిస్తున్న రెండురోజుల అంతర్జాతీయ సదస్సును సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా సమాజం ఒకవైపే అభివృద్ధి చెందుతోందని, గ్రామీణ ప్రాంతం, ముఖ్యంగా ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో అభివృద్ధి అంతగా జరగట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏజెన్సీ ఏరియాలో అడవుల పెంపకంపై దృష్టిపెట్టాల్సిన బాధ్యత అటు ప్రభుత్వాలపై ఇటు సమాజంపై ఉందని మంత్రి అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ మాజీ డీన్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వచ్చే సమస్యలను పరిష్కరించడానికి ఆదివాసీ గ్రామాలను సందర్శించినట్లు తెలిపారు. ఏ అభివృద్ధి నమూనాలోనైనా ఆదివాసీలు వెనకంజలోనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీలు నిర్వాసితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల పలు సమస్యలపై కాన్ఫరెన్స్‌లో చర్చించి సరైన సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదిక అందించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.సుధారాణి, విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.పుష్పా చక్రపాణి, సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ గుంటి రవీందర్, సామాజిక శాస్త్రం విభాగ డీన్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, సదస్సు కో డైరెక్టర్ ప్రొఫెసర్ జి.లక్ష్మి, పలు విభాగాల అధిపతులు, డీన్లు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు తీసుకొస్తాం :** రాంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఉత్తమ ఫలితాలు తీసుకొస్తామని మంత్రి సీతక్క(%వీఅఅఅర్వతీ రాఘుఎెఘు%) పేర్కొన్నారు. తెలంగాణ బాలోత్సవం సంస్థ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. బాలోత్సవం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు భూపతి వెంకటేశ్వర్లు, ఎం.సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన విద్యా వ్యవస్థను పటిష్ఠం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టారని, ఇందులో భాగంగానే విద్యా వ్యవస్థకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కవిత 11 కిలోల బరువు తగ్గారు: కేటీఆర్



హైదరాబాద్: దిల్లీ మద్యం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియాకు బెయిల్ వచ్చిందని.. అరవింద్ కేజ్రీవాల్, కవితకు కూడా వస్తుందని భావిస్తున్నామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఛార్జ్‌షీట్ వేశాక జైల్లో ఉంచాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కవితకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశామన్నారు. త్వరలోనే బెయిల్ వస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. జైల్లో కవిత 11 కిలోల బరువు తగ్గారని.. బీపీ, ఇతర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ తెలిపారు.

# ఆ గురుకుల పాఠశాలలో వరస మరణాలు బాధాకరం..

జగిత్యాల: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల వరస మరణాలు బాధాకరమని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఇవాళ(శుక్రవారం) తెల్లవారుజామున ఇద్దరు విద్యార్థులు తీవ్ర కడుపునొప్పితో అస్వస్థతకు గురి కాగా.. వారిలో ఒకరు మృతిచెందారు. విషయం తెలుసుకున్న జీవన్ రెడ్డి, లక్ష్మణ్ హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థులు అనిరుద్, మోక్షిత్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, అందులో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన అనిరుద్ మృతిచెందినట్లు తమకు సమాచారం అందిందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చెప్పారు. సమాచారం అందగానే హుటాహుటిన వచ్చినట్లు ఆయన తెలిపారు. ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాస్థాయి అధికారులతో మాట్లాడామని, బాధ్యులెవరైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే గురుకులాలు వెనకపడ్డాయని ఎమ్మెల్యే లక్ష్మణ్ మండిపడ్డారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ గురుకులాల్లో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. సంజయ్ తండ్రి పదేళ్లపాటు అధికారంలో ఉండి గురుకులాలకు ఏం చేసింది చెప్పాలంటూ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

ఘటనకు కారణమైన వారిని ఎవ్వరినీ వదిలేది లేదని ఎమ్మెల్యే లక్ష్మణ్ హెచ్చరించారు. కాగా.. జులై 27న సైతం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో రాత్రి సమయంలో నిద్రపోతున్న హర్షవర్ధన్, ఆడేపు గణేశ్ అనే ఇద్దరు విద్యార్థులను పాము కాటు వేసింది. దీంతో వారిద్దరూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిద్దరనీ నిజామాబాద్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అదే రోజు వారితోపాటే నిద్రిస్తున్న మెట్‌పల్లి ఆరపేటకు ఘనాదిత్య తెల్లవారే సరికి శవమై తేలాడు. విద్యార్థి నిద్రలోనే కాళ్లు, చేతులు వంకర్లు తిరిగి మృతిచెందాడు. ఇలా వరసగా తమ పిల్లలు మృత్యువాత పడడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. విషయం తెలుసుకున్న అధికార పక్ష నేతలు వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులకు ధైర్యం చెప్తున్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరిస్తున్నారు.

# విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు..

హైదరాబాద్ సిటీ: గ్రేటర్‌లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తూ, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఖైరతాబాద్‌లోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో గ్రేటర్ పరిధిలో మాన్సూన్ సీజన్‌లో నిరంతర సరఫరాకు సంస్థ చేస్తున్న ఏర్పాట్లు, ఫీడర్ సర్వే కోసం రూపొందించిన టీజీఎయిమ్స్ మొబైల్ యాప్, విద్యుత్ సమస్యలు, భవిష్యత్ డిమాండ్‌పై సమీక్ష నిర్వహించారు. గ్రేటర్ పరిధిలోని విద్యుత్ వ్యవస్థ పనితీరుపై మొదటిసారి డిప్యూటీ సీఎం మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధిలోని సీఈ, ఎస్‌ఈలతో పాటు డీఈ, ఏడీఈలతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో గ్రేటర్‌జోన్ విద్యుత్ డిమాండ్ 10వేల మెగావాట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామన్నారు. భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కొత్త సబ్‌స్టేషన్లు, విద్యుత్‌లైన్లు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. త్వరలో బౌరంపేటలో 220 కేవీ సబ్‌స్టేషన్ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

వర్షాకాలంలో విద్యుత్‌సరఫరాలో ఎక్కడా అంతరాయాలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. యాజమాన్యం స్థాయిలో నిర్ణయం తీసుకొని వెంటనే ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని సీఎండీలను ఆయన ఆదేశించారు.

**ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి..** 1912 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు విద్యుత్ కార్యాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే అధికారులు, సిబ్బంది స్పందించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఫీడర్ సర్వే కోసం రూపొందించిన టీజీఎయిమ్స్ మొబైల్ యాప్ పనితీరును టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారుఖీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమీక్షలో మెట్రోజోన్ సీఈ నర్సింహస్వామి, రంగారెడ్డి జోన్ సీజీ పి.ఆనంద్, మేడ్చల్ జోన్ సీఈ సాయిబాబా, 10 సర్కిళ్ల ఎస్‌ఈలు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com